



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు






సంపుటి : 11 సంచిక :145 పేజీలు :12 సంపాదకులు : గంట్యాడ అప్పారావు ప్రచురణ : ఒంగోలు గురువారం 30 జనవరి 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE : 145 PAGES :12 EDITOR : GANTYADA APPARAO PUBLISHED :ONGOLE THU 30 JANUARY 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Ongole, Kakinada,Visakhapatnam, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur





# తెలుగు రాష్ట్రాల్లో మోగిన ఎమ్మెల్సీఎన్నికల నగారా

- ఏపీ, తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల
- ఫిబ్రవరి 3న ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల
- ఫిబ్రవరి 27న పోలింగ్
- మార్చి 3న చేపట్టనున్న ఓట్ల లెక్కింపు
- తెలుగు రాష్ట్రాల్లో మూడు చొప్పున ఎమ్మెల్సీ స్థానాల్లో ఎన్నికలు

**పెన్ పవర్ డెస్క్:**ఏపీ, తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైంది. ఫిబ్రవరి 3న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. ఫిబ్రవరి 27న పోలింగ్ ఉంటుంది. మార్చి 3న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను రిలీజ్ చేసింది. కాగా, రెండు తెలుగు రాష్ట్రాల్లో మూడు చొప్పున ఎమ్మెల్సీ స్థానాల్లో ఎన్నికలు జరగనున్నాయి.

తెలంగాణలో మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ ఉపాధ్యాయ నియోజక వర్గానికి ఎన్నికలు నిర్వహించనున్నారు. అదే స్థానంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు కూడా జరగనున్నాయి. వీటితో పాటు వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గానికి కూడా ఎన్నికలు నిర్వహించనున్నారు. అటు ఏపీలో ఉమ్మడి ఉభయగోదావరి, కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గాలకు ఎన్నికలు జరగనున్నాయి. అలాగే శ్రీకాకుళం-విజయనగరం-విశాఖపట్నం ఉపాధ్యాయ నియోజక వర్గానికి ఎన్నికలు నిర్వహించేందుకు ఈసీ షెడ్యూల్ విడుదల చేసింది.

నోటిఫికేషన్ రిలీజ్: ఫిబ్రవరి 3
నామినేషన్ల చివరి తేది: ఫిబ్రవరి 10
నామినేషన్ల పరిశీలన: ఫిబ్రవరి 11
నామినేషన్ల విత్ డ్రా లాస్ట్ డేట్ : ఫిబ్రవరి 13
పోలింగ్ తేది: ఫిబ్రవరి 27
పోలింగ్ సమయం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటలు
ఓట్ల లెక్కింపు తేది : మార్చి 3

## మహా కుంభమేళాలో తొక్కిసలాట..
# 30 మంది మృతి




- నిన్న మౌని అమావాస్య
- సంగమం వద్ద స్నానాలు ఆచరించేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు
- బారికేడ్లు విరిగిపోవడంతో తొక్కిసలాట
- సీఎం యోగికి ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్న ప్రధాని మోదీ
- కుంభమేళా తొక్కిసలాట మృతుల సంఖ్య 30... యూపీ ప్రభుత్వ ప్రకటన
- మహా కుంభమేళాలో విషాద ఘటన
- తొక్కిసలాటలో ప్రాణనష్టం
- ప్రెస్ మీట్ లో వివరాలు తెలిపిన డీఐజీ

**పెన్ పవర్ డెస్క్:**ఉత్తరప్రదేశ్ లోని ప్రయాగ్ రాజ్ లో జరుగుతున్న మహా కుంభమేళాలో విషాద ఘటన చోటుచేసుకోవడం తెలిసిందే. గత అర్ధరాత్రి తర్వాత జరిగిన తొక్కిసలాటలో పలువురు భక్తులు ప్రాణాలు కోల్పోయారు. మౌని అమావాస్య కావడంతో త్రివేణి సంగమంలో పుణ్యస్నానం ఆచరించేందుకు భక్తులు పోటెత్తారు. బారికేడ్లు విరిగిపోవడంతో ఒక్కసారిగా తొక్కిసలాట జరిగి ప్రాణనష్టం జరిగింది. అయితే, దీనికి సంబంధించి ఇప్పటివరకు మృతుల సంఖ్యపై స్పష్టత లేదు. ఈ నేపథ్యంలో, మహాకుంభ్ కార్యకలాపాలు పర్యవేక్షిస్తున్న డీఐజీ మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. కుంభమేళా తొక్కిసలాట ఘటనలో 30 మంది మృతి చెందారని వెల్లడించారు. 60 మంది గాయపడ్డారని తెలిపారు. మృతుల్లో 25 మందిని గుర్తించామని, మరో ఐదుగురి వివరాలు తెలియాల్సి ఉందని అన్నారు. అర్ధరాత్రి ఒంటి గంట నుంచి 2 గంటల మధ్య ఈ తొక్కిసలాట జరిగిందని డీఐజీ పేర్కొన్నారు. బారికేడ్ల ధ్వంసం వల్లే తొక్కిసలాట జరిగిందని వివరించారు. ప్రజలు వివరాలు తెలుసుకునేందుకు '1920' హెల్ప్ లైన్ నెంబరును అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. ఇవాళ కుంభమేళాకు వీఐపీలను ఎవరినీ అనుమతించడం లేదని స్పష్టం చేశారు.

# వారి కన్నీరు తుడవాలనే రైతు రుణమాఫీ చేశాం



- పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రైతుల ఇబ్బందులు చూశామన్న మంత్రి
- భూమికి, విత్తనానికి ఉన్న సంబంధమే రైతులకు, కాంగ్రెస్ పార్టీకి ఉన్నదన్న మంత్రి
- రైతు బాగుంటేనే దేశం బాగుంటుందని నమ్మే ప్రభుత్వమన్న మంత్రి

వివరాలు 2లో..

# ఆర్జీవీకి మరోసారి ఏపీ పోలీసుల నోటీసులు

- ఫిబ్రవరి 4న విచారణకు హాజరు కావాలని పోలీసుల నోటీసులు
- ఈ మేరకు వాట్సప్ ద్వారా వర్మకు నోటీసులిచ్చిన ఒంగోలు రూరల్ పోలీసులు
- 4న సినిమా షూటింగ్ కారణంగా తాను బిజీగా ఉంటానన్న ఆర్జీవీ
- 7వ తేదీన విచారణకు వచ్చే అవకాశాన్ని పరిశీలిస్తానని వెల్లడి



**పెన్ పవర్ డెస్క్:**సోషల్ మీడియాలో టీడీపీ అధినేత చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్‌లపై అభ్యంతకర పోస్టుల కేసులో వివాదాస్పద దర్శకుడు రాం గోపాల్ వర్మకు

వివరాలు 2లో..

# జగన్ క్వాష్ పిటిషన్ పై విచారణ వాయిదా

- అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు వ్యవహారంలో మంత్రి నారాయణపై ఒక పత్రికలో వార్తలు
- తన పరువుకు భంగం కలిగేలా ఉన్నాయంటూ పరువునష్టం దావా వేసిన నారాయణ
- క్వాష్ పిటిషన్ ను విచారించిన ఏపీ హైకోర్టు




వివరాలు 2లో..

**పెన్ పవర్ డెస్క్:**తనపై నమోదైన పరువునష్టం కేసును కొట్టివే యాలని కోరుతూ వైసీపీ అధినేత జగన్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్ పై విచారణను ఏపీ హైకోర్టు వాయిదా వేసింది. జగన్ పిటిషన్ పై కౌంటర్ దాఖలు చేసేందుకు సమయం కావాలని

## సౌదీలో ఘోర రోడ్డు ప్రమాదం..
# 9 మంది భారతీయుల మృతి!

- సౌదీలోని జిజాన్‌లో దుర్ఘటన
- సోషల్ మీడియా ద్వారా వెల్లడించిన జెడ్డాలోని భారత ఎంబసీ
- మృతుల కుటుంబాలకు అండగా ఉంటామన్న రాయబార కార్యాలయం
- ఈ ఘటనపై విచారం వ్యక్తం చేసిన భారత విదేశాంగ శాఖ

**పెన్ పవర్ డెస్క్:**సౌదీ అరేబియాలో బుధవారం నాడు ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సౌదీలోని జిజాన్‌లో జరిగిన ఈ దుర్ఘటనలో 9 మంది భారతీయ పౌరులు ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయాన్ని జెడ్డాలోని భారత ఎంబసీ సోషల్ మీడియా ద్వారా వెల్లడించింది.

వివరాలు 2లో..



# రాష్ట్రంలో వాట్సాప్ ద్వారా 161 రకాల సేవలు... చంద్రబాబు సమీక్ష



- నేడు వాట్సాప్ గవర్నెన్స్ సేవలు ప్రారంభించనున్న మంత్రి లోకేశ్
- మొదటి దఫాలో పౌరులకు అందుబాటులోకి వివిధ రకాల సేవలు
- గతేడాది మెటాతో ఒప్పందం

**పెన్ పవర్ డెస్క్:**వాట్సాప్ గవర్నెన్స్‌పై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో వాట్సాప్ గవర్నెన్స్ సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకురానున్న నేపథ్యంలో సీఎం సమీక్షించారు

వివరాలు 2లో..

## అసర్ నివేదికతో విద్యావ్యవస్థలో
# విధ్వంసం బయటపడింది

- దేశంలోని విద్యా ప్రమాణాలపై అసర్ నివేదిక
- 2022-24 మధ్య ఏపీలో విద్యా ప్రమాణాలు దిగజారాయన్న అసర్
- జగన్ పై మంత్రి నారా లోకేశ్ విమర్శనాస్త్రాలు

**పెన్ పవర్ డెస్క్:** దేశంలోని విద్యా ప్రమాణాలపై యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్ట్ (ASER-అసర్) వెలువడడం తెలిసిందే. 2022-24 మధ్య కాలంలో ఏపీలో విద్యా

వివరాలు 2లో..



# కుంభమేళా తొక్కిసలాట బాధాకరం



- తొక్కిసలాటలో 20 మంది యాత్రికులు చనిపోవడం బాధించిందన్న పవన్
- ఇదొక దురదృష్టకర ఘటన అని పేర్కొన్న జనసేనాని
- తెలుగు రాష్ట్రాల నుంచి కుంభమేళాకు వెళ్లినవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచన

వివరాలు 2లో..

# ఆ భూమిని 2001లోనే కొనుగోలు చేశాం

- అటవీభూమిని ఆక్రమించుకున్నట్టు పెద్దిరెడ్డిపై ఆరోపణలు
- ఎల్లో మీడియా తప్పుడు కథనాలు రాస్తోందంటూ పెద్దిరెడ్డి ఫైర్
- కిరణ్ కుమార్ హయాంలో సర్వే కూడా చేశారని వెల్లడి
- రోడ్డుకు అనుమతులు కూడా తెచ్చుకున్నామని స్పష్టీకరణ
- చంద్రబాబు తానా అంటే పవన్ తందానా అంటున్నాడని విమర్శలు
- రాష్ట్ర ప్రజలు ఇది గమనించాలని విజ్ఞప్తి



**పెన్ పవర్ డెస్క్:**చిత్తూరు జిల్లా మంగళంపేట రెవెన్యూ గ్రామ పరిధిలో 75 ఎకరాల అటవీ భూములను ఆక్రమించుకున్నట్టు వచ్చిన ఆరోపణలపై మాజీ మంత్రి, వైసీపీ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మీడియా

వివరాలు 2లో..

# దమ్ముంటే బహిరంగంగా యమునా నీరు తాగండి

## మోడీ, రాహుల్‌కు కేజ్రీవాల్ ఛాలెంజ్



**పెన్ పవర్ డెస్క్:** మరో వారం రోజుల్లో జరగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో 'యుము నా వాటర్' ఇష్యూ కాకరేపుతోంది. యమునా నది నీటిని హర్యానాలోని బీజేపీ ప్రభుత్వం విషపూరితం చేస్తోందంటూ కేజ్రీవాల్ చేసిన కామెంట్స్ ఢిల్లీ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతున్నాయి. కేజ్రీవాల్ వ్యాఖ్యలకు బీజేపీ నేతలు ధీటుగా కౌంటర్ ఇస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రధాని మోడీ సైతం కేజ్రీవాల్ కామెంట్స్‌పై విరుచుకుపడ్డారు. ఎన్నికల్లో ఓడిపోతామనే

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# ఇండియా... ఇప్పుడు సూపర్ పవర్

భారతదేశం ఇప్పుడు ప్రపంచంలోనే అగ్రరాజ్యాంగా ఎదుగుతోంది. దీంతో పాటే.. భారత రక్షణ సామర్థ్యాలు కూడా భారీగా పెరుగుతున్నాయి. భారత్ అమ్ములపొదిలో కొత్త కొత్త ఆయుధాలు వచ్చి చేరుతున్నాయి. ముఖ్యంగా, ఆత్మనిర్భర్ భారత్ తన సొంత టెక్నాలజీతో ప్రపంచం ఉలిక్కిపడే ఆయుధాలను తయారు చేస్తోంది. ఇందులో భాగంగానే.. ఈ రిపబ్లిక్ డే పెరేడ్‌లో రెండు కీలక ఆయుధాలను దేశానికి పరిచయం చేయబోతున్నారు. శత్రు దేశాల వెన్నులో వణుకుపుట్టించే ఈ క్షిపణులు 75 ఏళ్ల గణతంత్ర దినోత్సవ వేడుకలో మరింత ప్రత్యేకంగా నిలిచాయిభారత్ అంటేనే ఇప్పుడు ప్రపంచమంతా అలెర్ట్ అవుతోంది. అంతర్జాతీయంగా భారతదేశ పరపతి అగ్రదేశాలకు దాదాపు సమానమయ్యింది. ముఖ్యంగా, రక్షణ రంగంలో భారత్ తన సత్తా ఏంటో ప్రపంచానికి చూపిస్తోంది. "ఎప్పుడొచ్చామన్నది కాదు.. బుల్లెట్ దిగిందా.. లేదా" అనే లెవల్లో? ఒకప్పుడు, కాస్త వీక్‌గా ఉన్న భారత రక్షణ రంగం? ఇప్పుడు సగర్వంగా ఛాతి చూపి నిలుస్తోంది. జబ్బ చరిచి కమాన్ అనే స్థాయికి వెళ్లింది. బంగ్లాదేశ్ లాంటి తోక ఊపుళ్లకే కాదు.. ఆగర్భ శత్రువు పాకిస్తాన్‌తో పాటు.. చారిత్రక ఎనిమీ చైనాలకు కూడా చెమటలు పట్టించేంతగా భారత్ రక్షణ సామర్థ్యం పెరిగింది. ఇప్పుడు, అగ్ర రాజ్యాలను సైతం కించింతైనా కేర్ చేయని స్థాయిలో భారత్ త్రివధ దళాలు బలం పుంజుకున్నాయి. ఒకప్పుడు, దిగుమతులపై ఆధారపడిన భారత్ రక్షణ రంగం.. 75 ఏళ్ల గణతంత్రం జరుపుకునే నాటికి ప్రపంచానికి సరికొత్త ఆయుధాలను పరిచయం చేస్తోంది. ఫ్రాన్స్ లాంటి అగ్రదేశాలు కూడా భారత్ ఆయుధాలపై ఆసక్తి చూపుతున్నాయి. దటీజ్ భారత్ అనే విధంగా భారతదేశం తన వెపనరీని అభివృద్ధి చేసుకుంది. అందులో, సరికొత్తగా రెండు కీలకమైన ఆయుధాలను ఈ రిపబ్లిక్ డేలో ప్రదర్శిస్తున్నారు. శత్రుదేశాల కుతంత్రాలను ధీటుగా ఎదుర్కోవాలంటే రక్షణ రంగంలో మెరుగైన ఆయుధ సంపత్తి అవసరం. అందుకే భారత్ కొన్నేళ్లుగా దీనిపై దృష్టి సారించింది. అనేక స్వదేశీ ఆయుధాలను సిద్ధం కూడా చేసింది. అందులో అత్యంత ముఖ్యమైంది పినాక. భారత భూభాగంపై కన్నేసిన చైనాకు షాకిచ్చే విధంగా భారత తన సొంత టెక్నలజీతో ఈ కొత్త వెపన్‌ను తయారుచేసింది. ఇటీవల కాలంలో అభివృద్ధి చేసిన ఈ పినాక ఎంకే-1ను భారత్ ఈ గణతంత్ర దినోత్సవంలో ప్రదర్శించనుంది. భారీ లక్ష్యాలను సైతం ఛేదించగల పినాక మల్టీ బ్యారెల్ రాకెట్ లాంచర్, ప్రత్యర్థి తేరుకునేలోపే టార్గెట్‌ను బూడిదగా మార్చేస్తుంది. సాయుధ బలగాల కార్యచరణ సంసిద్ధతను మెరుగుపరచడంలో భాగంగా.. చైనా, పాకిస్తాన్ సరిహద్దుల్లో పినాక రెజిమెంట్‌లను మోహరిస్తున్నారు. పినాక మార్క్-1 కు 45 కి.మీ., మార్క్-2 కు 65 కి.మీ. పరిధి ఉంది. పినాక వ్యవస్థ 44 సెకండ్లలో 12 హై ఎక్స్‌ప్లోజివ్ రాకెట్లను పేల్చగలదు. ఈ వ్యవస్థ తేలిగ్గా రవాణా చెయ్యగలిగేలా, టాటా ట్రక్కుపై మోహరించి ఉంటుంది. ఇది మొదట కార్గిల్ యుద్ధంలో పాల్గొంది. పర్వతాలపై ఉన్న శత్రు దళాలను విజయవంతంగా నిర్వీర్యం చేసింది. తర్వాత, దీన్ని భారత సైన్యంలో పెద్ద సంఖ్యలో చేర్చుకున్నారు. 2014 నాటికి, ఏటా 5,000 పినాక రాకెట్లు ఉత్పత్తిలో ఉన్నాయి. ఎక్కువ పరిధి, అధిక కచ్చితత్వం కలిగిన మెరుగైన పినాక అభివృద్ధి దశలో ఉంది. ఈ పినాక వ్యవస్థ ధర రూ.2.3 కోట్లు. పినాక ఒక సంపూర్ణ రాకెట్ వ్యవస్థ. ఒక్కో పినాక బ్యాటరీలో? ఒక్కో దానిలో 12 రాకెట్లు కలిగిన 6 లాంచరు వాహనాలు, 3 రాకెట్ సరఫరా వాహనాలు, ఫైర్ కంట్రోల్ కంప్యూటర్ ఉన్న 2 కమాండ్ పోస్ట్ వాహనాలు ఉంటాయి. ఇందులో ఒక డిజికోరా మెట్ రాడార్ వ్యవస్థ కూడా ఉంటుంది. 6 లాంచర్లు కలిగిన ఈ బ్యాటరీ.. 1000 మీ విస్తీర్ణంలోని ప్రాంతాన్ని నిర్వీర్యం చెయ్యగల సార్థ్యంతో పనిచేస్తుంది. ఇలాంటి, 72 రాకెట్లు కలిగిన బ్యాటరీని సైన్యం మోహరిస్తుంది. ఈ రాకెట్లన్నిటినీ 44 సెకండ్లలో పేల్చొచ్చు. ఇక, ప్రస్తుత ప్రపంచ ఉద్రిక్తతల మధ్య చాలా దేశాలు మల్టీ బ్యారెల్ రాకెట్ లాంచర్ల పట్ల ఆసక్తిని కనబరుస్తున్న తరుణంలో.. పినాక రాకెట్‌ను ఆర్మేనియాకు కూడా సరఫరా చేయడం ప్రారంభించింది. అత్యంత శక్తివంతమైన ఈ స్వదేశీ పినాక రాకెట్‌పై ఇటీవల ఆగ్నేయాసియా, యూరప్‌లోని అనేక దేశాలు కూడా ఆసక్తి చూపిస్తున్నాయి. అంతెందుకు, ప్రపంచంలోని అతి శక్తిమంతమైన దేశాల్లో ఒకటైన ఫ్రాన్స్? ఓ51 జలాంతర్గాములు, రాఫెల్ యుద్ధవిమానాలు, లుక్‌లెహ్ శతఘ్నుల వంటి అధునాతన ఆయుధ వ్యవస్థలు ఉన్నప్పటికీ? భారత్‌కు చెందిన పినాకను కావాలనుకుంటోంది. ఇందులో భాగంగా, గతేడాది నవంబర్ నుండి ఫ్రెంచ్ ఆర్మీ అధికారులు భారత్‌తో చర్చలు జరుపుతున్నారు. ఇక, మరో అత్యద్భుతమైన ఆయుధాన్ని కూడా ఈ రిపబ్లిక్ డేలో భారత్ ప్రదర్శిస్తోంది. మొట్టమొదటిసారిగా పరేడ్‌లో ప్రళయ్ మిస్సైల్ కన్పించనుంది. ఇది శత్రువులకు సవాలుగా మారే అత్యాధునిక ఆయుధం. డీఆర్డీవో అభివృద్ధి చేసిన ఈ మిస్సైల్ భారత్ శక్తి సామర్థ్యాలకు ఓ మచ్చుతునక. సరిహద్దు రక్షణలో ప్రళయ్ మిస్సైల్ కీలకంగా మారుతుంది. చైనా, పాక్‌లకు చెక్ పెట్టాడానికి, ప్రత్యేకంగా ప్రళయ్‌ను ఎల్ఏసీ, ఎల్ఓసీ వెంట మోహరించేందుకు రూపకల్పన జరిగింది. శత్రువుల వ్యూహాల్ని ఇది ధ్వంసం చేయగలదు. ఇతర మిస్సైల్స్‌తో పోలిక ప్రళయ్ మిస్సైల్‌ను చైనాకు చెందిన డోంగ్ ఫెంగ్ 12, రష్యాకు చెందిన ఇస్కాండర్ మిస్సైల్‌కు సమానమని తెలుస్తోంది. ఈ మిస్సైల్ యుద్ధ మైదానంలో శత్రువులకు దీటైన సమాధానం చెబుతుంది. ప్రళయ్ మిస్సైల్ సాంకేతిక ప్రత్యేకతలు ఈ మిస్సైల్ 350 కిలో మీటర్ల నుండి 500 కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్ష్యాలను ఛేదించగలదు. అలాగే, 500 నుండి 1000 కిలోల వరకూ పేలోడ్ తీసుకెళ్లగలదు. లక్ష్యాన్ని కచ్చితంగా ఛేదించడంలో అద్భుతంగా పనిచేస్తుంది. భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ-ఆఖీఆూ అభివృద్ధి చేసిన ఈ వార్ వెపన్.. భూ ఉపరితలం నుండి ఉపరితలం నుండి ప్రయోగించగలిగిన స్వల్ప-శ్రేణి బాలిస్టిక్ క్షిపణి. అత్యంత కచ్చితత్వంతో ఛేజ్ చేయగలిగిన ఈ మిస్సైల్‌ను మొబైల్ లాంచర్లతో ప్రయోగించొచ్చు. వీటిని క్వాసీ బాలిస్టిక్ మిస్సైల్స్‌గా పిలుస్తారు. ఇవి బాలిస్టిక్, క్రూయిజ్ మిస్సైల్స్ రెండింటి లాగా పనిచేస్తాయి. భారత రక్షణ రంగ వ్యూహంలో భాగంగా దేశ ఉత్తర సరిహద్దులను బలోపేతం చేయడానికి ప్రళయ్ క్షిపణి సేవలను వినియోగిస్తున్నారు. ఉక్రెయిన్‌తో జరుగుతున్న యుద్ధంలో ఉపయోగించిన 'ప్రలే' క్షిపణి, చైనా 'డాంగ్ ఫెంగ్ 12', రష్యా 'ఇస్కాండర్', దక్షిణ కొరియా హ్యూన్మూ-2తో పోల్చదగని ప్రళయ్‌ను ఇప్పుడు భారత్‌లోనే భారీ ఎత్తున ఉత్పత్తి చేస్తున్నారు. ఇప్పటికే, ఇండియన్ ఆర్మీ, ఎయిర్ ఫోర్స్‌ల కోసం దాదాపు 500 వందల ప్రళయ్ క్షిపణులు ఆర్డర్‌లో ఉన్నాయి. ఇక, భారత సైన్యం, నిఘా సామర్థ్యాలను ఆధునీకరించే దిశగా భారత్ కీలక వ్యవస్థలను కూడా రూపొందిస్తోంది. తాజాగా, భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ న్యూఢిల్లీలో ఓ యుద్ధభూమి నిఘా వ్యవస్థను ప్రారంభించారు. సంజయ్ అనే పేరుతో ఉన్న ఈ అధునాతన ఆటోమేటెడ్ సిస్టమ్.. గ్రౌండ్, ఏరియల్ సెన్సార్‌ల నుండి డేటాను సేకరిస్తుంది. ఈ ఇన్‌పుట్‌లు ఆర్మీ డేటా నెట్‌వర్క్, శాటిలైట్ కమ్యూనికేషన్ నెట్‌వర్క్ ద్వారా సేకరించిన సమాచారాన్ని ఏకికృతం చేసి, కచ్చితత్వాన్ని నిర్ధారిస్తాయి. ఈ వ్యవస్థ యుద్ధభూమిలో ఏం జరుగుతుందో.. అద్దంలా చూపిస్తుంది. దీని ద్వారా, ఆర్మీ కమాండ్, హెడ్‌క్వార్టర్స్‌కు కేంద్రీకృత వెబ్ అప్లికేషన్‌తో నిర్ణయం తీసుకోవడానికి అవసరమయ్యే ఖచ్చితమైన, రియల్-టైమ్ సమచారాన్ని అందిస్తుంది. అత్యాధునిక సెన్సార్‌లు, అత్యాధునిక విశ్లేషణలతో రూపొందించిన 'సంజయ్' భారత భూ సరిహద్దులను పర్యవేక్షించడం, చొరబాట్లను నిరోధించడం, అనుమానమున్న పరిస్థితులపై అవగాహన కల్పించే విధంగా పనిచేస్తుంది. ఇది, ఇంటెలిజెన్స్, నిఘా కార్యకలాపాలలో కీలకంగా ఉంటుంది. ఇది భవిష్యత్ యుద్ధభూమిలో విప్లవాత్మక ఫలితాలను అందిస్తుందిభారత్ యుద్ధ సామర్థ్యం మామూలుగా లేదు. ప్రపంచంలోనే అతి పెద్ద సైన్యం కలిగిన మూడో దేశంగా ఉన్న భారత్‌ను ఎదుర్కోవాలంటే మూడు చెరువుల నీళ్లు తాగాల్సిందే. ఇండియాన్ ఆర్మీ పవర్ తెలిపే ఒక మాట ఇక్కడ చెప్పాలి. "ఒక సైన్యంలో.. బ్రిటీష్ ఆఫీసర్, అమెరికన్ వెపన్స్, భారత సైన్యం ఉంటే? దాన్ని ఎవ్వరూ ఓడించలేరంట". ఈ పాత కాలం నాటి నానుడికి ఇప్పుడు సరికొత్త మార్పు తోడయ్యింది. లేటెస్ట్ టాక్ ఏంటంటే.. "ఇండియన్ ఆఫీసర్, ఇండియన్ సైన్యం, ఇండియా వెపన్స్ ఉంటే.." ఎవ్వరైనా అడుగు ముందుకెయ్యాలంటే హడలిపోవాల్సిందే! ఎందుకంటే, అలాంటి అత్యాధునిక ఆయుధాలు ఇప్పుడు భారత్ సొంతం. అలాగే, క్రూయిజ్ క్షిపణుల్లో భాగంగా.. హైపర్ సోనిక్ క్రూయిజ్ మిస్సైల్, నిర్భయా మిస్సైల్, బ్రహ్మోస్-ఔఉ లను కూడా అభివృద్ధి చేస్తోంది. ఇక, 'నాగ్' పేరుతో యాంటీ-గైడెడ్ ట్యాంక్ మిస్సైళ్లను కూడా రూపొందిస్తోంది. ఇక, న్యూక్లియర్ ట్రయాడ్ సామర్థ్యాన్ని కలిగి ఉన్న ప్రపంచంలోని 6వ దేశంగా భారత్ ఉంది. భూమి, నీరు, గాలి నుండి కూడా అణు దాడి చేయగల సామర్థ్యం భారత్ సొంతం. సో.. రక్షణ రంగంలో భారత్ సూపర్ పవర్‌గా ఎదుగుతుందనడాన్ని ఇవన్నీ స్పష్టం చేస్తున్నాయి. దీన్ని బట్టి, ఇకపై కూడా.. భారత్, తన సార్వభౌమత్వాన్ని, మాతృభూమిని ఏ ఇతర దేశం మద్దతు లేకుండా ఒంటరిగా కాపాడుకోగలదు. శత్రు దేశాలకు ధీటుగా.. అత్యాధునిక ఆయుధాలతో, భారత్ ఇప్పుడు తన సామర్థ్యాన్ని నిరూపించుకుంటుంది. ఇక, రాబోయేది ఏ యుద్ధం అయినా.. అది ఎవరితో అయినా.. భారత్ రెడీ!

# రాష్ట్రంలో వాట్సాప్ ద్వారా 161 రకాల సేవలు... చంద్రబాబు సమీక్ష

- మొదటి పేజీ తరువాయి

నేడు (జనవరి 30) వాట్సాప్ గవర్నెన్స్ సేవలను ఐటీ, విద్యా శాఖా మంత్రి నారా లోకేశ్ అధికారికంగా ప్రారంభించనున్నారు. ఈ సమీక్షలో సీఎస్ కె.విజయానంద్‌తో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మొదటి విడతగా పౌరులకు 161 రకాల సేవలను ప్రభుత్వం వాట్సాప్ ద్వారా అందించనుంది. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు అధికారులు ప్రజంటేషన్ ఇచ్చారు. వాట్సాప్ ద్వారా సేవలను పొందాలనుకునే వారు ఏ విధంగా ఆప్షన్‌లను ఎంచుకుంటారనే దానిపై సీఎంకు అధికారులు వివరించారు. రెండవ విడతలో మరిన్ని సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకురానుంది. మొదటి విడతలో భాగంగా దేవాదాయ, ఎనర్జీ, ఏపీఎస్ ఆర్టీసీ, రెవెన్యూ, అన్న క్యాంటీన్, సీఎంఆర్ఎఫ్, మున్సిపల్ వంటి వివిధ శాఖల్లో సుమారు 161 రకాల సేవలను ప్రవేశపెట్టనుంది.

దేశంలోనే మొదటిసారి వాట్సాప్ గవర్నెన్స్ విధానాన్ని రాష్ట్రంలో ప్రవేశ పెడుతున్నామని, ధృవపత్రాల కోసం పౌరులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే విధానానికి ఇక స్వస్తి పలకనున్నామని ముఖ్యమంత్రి అన్నారు. అదే విధంగా పౌరుల సమాచారం సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉందని, ఆ దిశగా అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫోరెన్సిక్, సైబర్ సెక్యూరిటీని బలోపేతం చేయాలని సూచించారు.

వాట్సాప్ ద్వారా సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గతేడాది అక్టోబర్ 22న మెటాతో ఒప్పందం చేసుకుంది. ఆంధ్రప్రదేశ్‌ను డిజిటల్ టెక్నాలజీ వినియోగంలో అగ్రగామిగా మార్చే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తున్న తరుణంలో పాలన, ప్రభుత్వ సేవలను పౌరులకు వేగవంతంగా అందజేయడానికి ఈ విధానం సులభతరం కానుంది.

# జగన్ క్వాష్ పిటిషన్ పై విచారణ వాయిదా

- మొదటి పేజీ తరువాయి

మంత్రి నారాయణ తరపు న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా కోర్టును కోరారు. జగన్ తరపు న్యాయవాది, మాజీ అడ్వొకేట్ జనరల్ శ్రీరామ్ తన వాదనలు వినిపిస్తూ వరుసగా విచారణకు సమయం అడుగుతున్నారని... పిటిషన్ పై రెగ్యులర్ విచారణ జరపాలని కోరారు. ఈ క్రమంలో తదుపరి విచారణను మూడు వారాల పాటు హైకోర్టు వాయిదా వేసింది.

పరువునష్టం కేసు వివరాల్లోకి వెళితే... అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్ మెంట్ మార్పుల వెనుక అప్పటి మున్సిపల్ మంత్రి పొంగూరు నారాయణ పాత్ర ఉందంటూ ఒక పత్రికలో కథనాలు వచ్చాయి. సదరు పత్రిక కథనాలతో తన పరువుకు భంగం వాటిల్లిందని విజయవాడ ప్రజాప్రతినిధుల కోర్టులో నారాయణ దావా వేశారు. దీనిపై ఆ కోర్టులో విచారణ జరిగింది. విచారణకు హాజరు కావాలంటూ జగన్ కు కోర్టు పలుమార్లు సమన్లు జారీ చేసింది. అయితే ఆయన కోర్టుకు హాజరు కాలేదు. ఆ తర్వాత కేసును కొట్టివేయాలని కోరుతూ హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు.

# అసర్ నివేదికతో విద్యావ్యవస్థలో విధ్వంసం బయటపడింది

- మొదటి పేజీ తరువాయి

ప్రమాణాలు దిగజారాయని అసర్ స్పష్టం చేసింది. దీనిపై ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పందించారు. జాతీయ సర్వే సంస్థ అసర్ నివేదికతో జగన్ రెడ్డి గారి పాలనలో ప్రభుత్వ విద్యా వ్యవస్థలో జరిగిన విధ్వంసం బయటపడిందని తెలిపారు. ఆయన ప్రచారానికి మేనమామ, వాస్తవానికి కంసమామ అని మరోసారి రుజువైందని ఎద్దేవా చేశారు. పబ్లిసిటీ కోసం వందల కోట్లు ఖర్చు చేశారే తప్ప విద్యా ప్రమాణాలు పెంచే కనీస చర్యలు తీసుకోలేదని తేటతెల్లం అయ్యిందని లోకేశ్ విమర్శించారు. "2018లో నాటి టీడీపీ హయాంలో మెరుగ్గా ఉన్న ప్రభుత్వ విద్యా ప్రమాణాలు వైసీపీ పాలనలో ఎలా దిగజారాయో అసర్ నివేదికలో స్పష్టంగా వెల్లడించింది. అడ్డగోలు జీవోలు తీసుకొచ్చి ప్రభుత్వ పాఠశాలల మూసివేత, అక్షరాలు, అంకెలు గుర్తుపట్టలేని స్థితిలో విద్యార్థులు, తగ్గిన హాజరు శాతం, తాగునీరు, మరుగుదొడ్లు లాంటి కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడం... ఇలా అనేక అంశాలు గత ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణిని ఎండగడుతున్నాయి. ఎనిమిదో తరగతి విద్యార్థుల్లో దాదాపు సగం మంది రెండో తరగతి పుస్తకాలు సరిగా చదవలేని పరిస్థితి నెలకొంది.

విధ్వంసానికి గురైన విద్యా వ్యవస్థను గాడిన పెట్టేందుకు గత ఏడు నెలలుగా అనేక చర్యలు తీసుకున్నాను. నిరంతరం అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ, క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవాలు తెలుసుకుంటూ అనేక మార్పులకు నాంది పలికాను. ప్రభుత్వ విద్యావ్యవస్థలో ఎంత మంది విద్యార్థులు చదువుతున్నారు అని పక్కా లెక్కలు తీయడం దగ్గర మొదలుపెట్టి... మారుతున్న కాలానికి తగ్గట్టుగా పాఠ్యప్రణాళిక సిద్ధం చేయడం, విలువలతో కూడిన విద్య, విద్యార్థులను క్రీడలతో సహా ఇతర రంగాల్లో ప్రోత్సహించే గైడెన్స్ ఇవ్వడం, కనీస మౌలికవసతులు కల్పించడం, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడం వరకూ అనేక అంశాలపై దృష్టి పెట్టి పనిచేస్తున్నాం.

త్వరలోనే ప్రభుత్వ విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చే విధంగా ఆంధ్రప్రదేశ్ మోడల్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ రూపొందించి ప్రజలు, విద్యావేత్తల అభిప్రాయాలు తెలుసుకోబోతున్నాం" అని మంత్రి నారా లోకేశ్ వివరించారు.

# సౌదీలో ఘోర రోడ్డు ప్రమాదం.. 9 మంది భారతీయుల మృతి!

- మొదటి పేజీ తరువాయి

స్థానిక అధికారులతో టచ్‌లో ఉన్నామని, మృతుల కుటుంబాలకు తాము అండగా ఉంటామని పేర్కొంది. ఈ ఘటనపై భారత విదేశాంగ శాఖ విచారం వ్యక్తం చేసింది.

జెడ్డాలోని రాయబార కార్యాలయంతో తాను మాట్లాడానని, ప్రమాదం గురించి సమాచారం అడిగి తెలుసుకున్నట్లు విదేశాంగ మంత్రి జైశంకర్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా తెలిపారు. ఇండియన్ కాన్సులేట్ బాధిత కుటుంబాలతో ఎప్పటికప్పుడు మాట్లాడుతోందని అన్నారు. బాధిత కుటుంబాలకు తమ పూర్తి సహకారం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. కాగా, ఈ ప్రమాదంపై బాధిత కుటుంబాలు సమాచారం తెలుసుకోవడం కోసం అక్కడి ఇండియన్ ఎంబసీ హెల్ప్‌లైన్ నెంబర్‌లను ఏర్పాటు చేసింది. సమాచారం కోసం 8002440003 (టోల్‌ఫ్రీ), 0122614093, 0126614276, 0556122301 (వాట్సాప్) నెంబర్లలో సంప్రదించాలని తెలిపింది.

# కుంభమేళా తొక్కిసలాట బాధాకరం

**పెన్ పవర్ డెస్క్:** ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాలో తెల్లవారుజామున తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ దుర్ఘటనలో 20 మంది వరకు యాత్రికులు చనిపోయినట్లు వార్తలు వచ్చాయి. ఈ తొక్కిలాట ఘటనపై తాజాగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. ఈ ఘటన చాలా బాధాకరమని, 20 మంది చనిపోవడం ఆవేదనకు గురి చేసిందన్నారు. మౌని అమావాస్య సందర్భంగా త్రివేణి సంగమంలో పవిత్ర స్నానాలు ఆచరించేందుకు కోట్లాది మంది భక్తులు తరలిరావడంతో తొక్కిసలాట చోటు చేసుకోవడం బాధాకరమన్నారు. ఇదొక దురదృష్టకర ఘటన అని పవన్ పేర్కొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి కుంభమేళాకు వెళ్లిన వారు అధికారుల సూచనలు పాటిస్తూ, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తొక్కిసలాటలో చనిపోయిన మృతుల కుటుంబాలకు జనసేనాని ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# వారి కన్నీరు తుడవాలనే రైతు రుణమాఫీ చేశాం

**పెన్ పవర్ డెస్క్:** పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రైతులు పడిన ఇబ్బందులను చూశామని, అందుకే వారి కన్నీరు తుడవాలనే ఉద్దేశంతో అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే రైతు రుణమాఫీ చేశామని తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. భూమికి, విత్తనానికి ఎలాంటి సంబంధం ఉందో, రైతులకు కాంగ్రెస్ పార్టీతో అదే విధమైన సంబంధం ఉందన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రకటించిన రూ.1 లక్ష రుణమాఫీని కూడా ఒకేసారి చేయలేదన్నారు. దీంతో రైతులపై రూ.11,145 కోట్ల మేర భారం పడిందని విమర్శించారు. గతంలో కోతల సమయానికి కూడా రైతుబంధు అందేది కాదని, కానీ తమది రైతు బాగుంటేనే దేశం బాగుంటుందని నమ్మే ప్రభుత్వమన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయం, అనుబంధ రంగాలకు 35 శాతం నిధులు కేటాయించినట్లు చెప్పారు. వరికి బోనస్ ఇస్తామని చెప్పి దానిని విజయవంతంగా అమలు చేశామన్నారు. సాగు చేసే రైతులకు నిజమైన భరోసా ఇవ్వాలనే ఉద్దేశంతో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వంటి పథకాలను ప్రారంభించామన్నారు. గత ప్రభుత్వం హయాంలో అస్తవ్యస్తంగా మారిన వ్యవసాయ రంగాన్ని తిరిగి గాడిలో పెట్టేందుకు కృషి చేస్తున్నామన్నారు. రైతును రాజు చేసేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను జీర్ణించుకోలేని ప్రతిపక్షాలు అసత్య ఆరోపణలు చేస్తున్నాయని విమర్శించారు.

# ఆర్‌జీవీకి మరోసారి ఏపీ పోలీసుల నోటీసులు

- మొదటి పేజీ తరువాయి

ఏపీ పోలీసులు మరోసారి నోటీసులు జారీ చేశారు. ఫిబ్రవరి 4న విచారణకు హాజరు కావాలని ప్రకాశం జిల్లా ఒంగోలు రూరల్ పోలీసులు ఆయనకు వాట్సప్ ద్వారా నోటీసులు ఇచ్చారు. అయితే, 4న సినిమా షూటింగ్ కారణంగా తాను బిజీగా ఉంటానని, 7వ తేదీన విచారణకు వచ్చే అవకాశాన్ని పరిశీలిస్తానని ఆర్‌జీవీ పోలీసులతో చెప్పినట్లు తెలుస్తోంది. ఇక గతంలో ఆయనకు రెండుసార్లు నోటీసులు ఇచ్చినా విచారణకు హాజరుకాని విషయం తెలిసిందే. ఆ తర్వాత హైకోర్టును ఆశ్రయించారాయన. దీంతో న్యాయస్థానం వర్మకు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. అలాగే దర్యాప్తునకు సహకరించాలని, పోలీసులు విచారణకు పిలిచినప్పుడు హాజరు కావాల్సి ఉంటుందని కోర్టు ఆర్‌జీవీకి సూచించింది. ఈ నేపథ్యంలోనే తాజాగా మరోసారి పోలీసులు నోటీసులు జారీ చేశారు.

# దమ్ముంటే బహిరంగంగా యమునా నీరు తాగండి

- మొదటి పేజీ తరువాయి

భయంతోనే యమునా నీటిని విషపూరితం చేస్తున్నారంటూ కేజ్రీవాల్ తప్పుడు ఆరోపణలు చేస్తున్నాడని మోడీ ఫైర్ అయ్యారు. మేం తాగేది కూడా యమునా నది నీటినే అని అంటూ కేజ్రీవాల్ వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు మోడీ. కేంద్ర హంశాఖ మంత్రి అమిత్ షా సైతం ఇదే విధంగా కేజ్రీవాల్ వ్యాఖ్యలను ఖండించారు. ఈ క్రమంలో యమునా వాటర్ ఇష్యూపై కేజ్రీవాల్ మరోసారి హాట్ కామెంట్స్ చేశారు. బుధవారం కేజ్రీవాల్ నేషనల్ మీడియాతో మాట్లాడుతూ.. హర్యానా నుంచి ఢిల్లీకి సరఫరా అవుతున్న యమునా నీటిలో అమ్మోనియా స్థాయిలు దాదాపు 3 పీపీఎం ఉంటాయి. కానీ జనవరి 21 తర్వాత అది 7 పీపీఎంకు పెరిగిందని అన్నారు. 7 పీపీఎం ఉన్న నీరు విషంతో సమానమని కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోడీ, కేంద్రమంత్రి అమిత్ షా, రాహుల్ గాంధీ దమ్ముంటే 7 పీపీఎం ఉన్న యమునా నీటిని బహిరంగంగా తాగాలని కేజ్రీవాల్ ఛాలెంజ్ విసిరారు. ఎన్నికలకు ముందుకు నీటిని కలుషితం చేసి ఢిల్లీలో నరమేధం సృష్టించి.. తద్వారా రాజకీయ లబ్ధి పొందాలని బీజేపీ ప్రయత్నించిందని ఆప్ అధినేత ఆరోపించారు. రాజకీయ స్వార్థం కోసం బీజేపీ ఢిల్లీ ప్రజలు జీవితాలను ప్రమాదంలో పడేస్తోందని మండిపడ్డారు. మరీ కేజ్రీవాల్ వ్యాఖ్యలపై బీజేపీ, కాంగ్రెస్ ఏ విధంగా స్పందిస్తోందో చూడాలి మరీ. ఇదిలా ఉంటే.. 2025, ఫిబ్రవరి 8న ఎన్నికలు, 8న కౌంటింగ్, ఫలితాలు విడుదల కానున్నాయి.

# ఆ భూమిని 2001లోనే కొనుగోలు చేశాం

- మొదటి పేజీ తరువాయి

సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తమపై వచ్చిన ఆరోపణలు నిరాధారమని స్పష్టం చేశారు. ఎల్లో మీడియా తప్పుడు కథనాలు రాస్తోందని మండిపడ్డారు. ఆ భూమిని తాము 2001లోనే కొనుగోలు చేశామని వెల్లడించారు. చంద్రబాబు కుట్రలు, కుతంత్రాలు ప్రజలకు బాగా తెలుసని... చంద్రబాబు ఎల్లో మీడియా సాయంతో తమ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నారని పెద్దిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, కిరణ్ కుమార్ రెడ్డి హయాంలో రెవెన్యూ అధికారులు ఆ భూమిని సర్వే చేశారని వెల్లడించారు. దీనికి సంబంధించి గతంలో ఫారెస్ట్ గెజిట్ కూడా విడుదలైందని, ఇది పబ్లిక్ డొమైన్ లోనే ఉంటుందని, ఎవరైనా చూసుకోవచ్చని అన్నారు. ఇక రోడ్డు విషయానికి వస్తే... గతంలో అది బండ్లు పోయేందుకు వీలుగా ఉందని, అయితే దాన్ని పక్కా రోడ్డుగా మార్చేందుకు తాము దరఖాస్తు చేసుకున్నామని చెప్పారు. ఆ రోడ్డు వేస్తే ఇతర రైతులకు కూడా ఉపయుక్తంగా ఉంటుందన్న ఉద్దేశంతో అటవీశాఖ నుంచి అనుమతులు తెచ్చుకున్నామని పెద్దిరెడ్డి వివరించారు. తారు రోడ్డు వేసుకోవచ్చని 2022లో అనుమతి వచ్చిందని వెల్లడించారు. కానీ, మీడియాలోని ఓ వర్గం దీన్ని కూడా అభూతకల్పనలతో రాసిందని ఆరోపించారు. ఒక అబద్ధాన్ని 10 సార్లు, 20 సార్లు చంద్రబాబు ఏవిధంగా అయితే చెబుతారో, ఈ పచ్చ పత్రికలు, పచ్చ మీడియా కూడా అదే విధంగా గోబెల్స్ ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. గతంలోనూ ఇలాగే వ్యక్తిత్వ హననానికి పాల్పడితే వారిపై చర్యలు తీసుకున్నామని, ద

చిత్తూరు కోర్టులో ఒక మీడియా సంస్థపై రూ.50 కోట్లకు... ఈనాడు, ఈటీవీపై ఒక రూ.50 కోట్లకు పరువునష్టం దావా వేశామని వివరించారు. ఇప్పుడు భూ ఆక్రమణలు అంటూ తప్పుడు కథనాలు రాసిన మీడియా సంస్థలపై కూడా పరువునష్టం దావా వేస్తామని పెద్దిరెడ్డి హెచ్చరించారు.

"కేవలం 23 ఎకరాల భూమి 75 ఎకరాలు ఎలా అయ్యింది అని వార్తలు రాశారు. అధునాతన గెస్ట్ హౌస్ కట్టారని వార్తలు రాశారు. 2001 లోనే అక్కడ పని చేసే వారికోసం మేము గెస్ట్ హౌస్ కట్టాం. కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు టీడీపీకి చెందిన వెంకటరమణ రెడ్డి ఫిర్యాదు చేశారు. ఆరోజు ఫారెస్ట్, రెవెన్యూ జాయింట్ సర్వే నిర్వహించి ఎలాంటి ఆక్రమణ లేదు అని తేల్చి చెప్పింది.

ఆ తర్వాత చంద్రబాబు సీఎం అయ్యాక మళ్ళీ ఫిర్యాదు చేస్తే అప్పుడు కూడా ఎలాంటి ఆక్రమణలు చేయలేదని గుర్తించారు. కోర్టులో పిటిషన్ వేసినా కూడా కోర్టు ఆ పిటిషన్ ను తోసిపుచ్చింది. 1968లో ఇచిన ఫారెస్ట్ గెజిట్ లో కూడా ఆ 76 ఎకరాలు వారికి సంబంధం లేదు అని తేల్చారు. దారి కూడా ఇవ్వాలని రైట్ ఆఫ్ వే కూడా కల్పించారుచంద్రబాబు తానా అంటే

ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తందానా అంటాడు. ఇక్కడేదో జరిగిపోయింది... మొత్తం దోచేశాడు... దీనిపై ఎంక్వైరీ వేస్తాం... తగిన చర్యలు తీసుకుంటాం అని చెప్పాడు. ఇదే పెద్దమనిషి ఎన్నికల సమయంలో నాపై తీవ్ర ఆరోపణలు చేశాడు. పెద్దిరెడ్డి ఇసుకలో రూ.40 వేల కోట్లు దోపిడీ చేశాడు అని చెప్పాడు. నేను ఒక్క రూపాయి అయినా దోచుకుని ఉంటే ఎందుకు చర్యలు తీసుకోలేదు?

ఇదే పెద్దమనిషి నేను ఎర్రచందనం స్మగ్లింగ్ లో కూడా ఉన్నానని ఆరోపణలు చేశాడు. ఆ స్మగ్లింగ్ చేసిన ఎర్రచందనం అంతా నేపాల్ లో పట్టుబడింది... మేం అధికారంలోకి వస్తే విచారణ చేపడతాం అని చెప్పాడు ఇదే పవన్ కల్యాణ్ గారు. మరి నువ్వు ఫారెస్ట్ మంత్రివి అయ్యావు... ఉప ముఖ్యమంత్రివి అయ్యావు... మరి నేపాల్ కు ఎర్రచందనం స్మగ్లింగ్ చేసి ఉంటే నువ్వు ఎందుకు చర్యలు తీసుకోలేదని అడుగుతున్నాను. ఏమీ లేకుండానే... వ్యక్తిత్వ హననానికి పాల్పడే విధంగా ఈ ప్రభుత్వం, ఈ ప్రభుత్వంలోని పెద్దలు వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర ప్రజలందరూ దీన్ని గమనించాలి" అని పెద్దిరెడ్డి పేర్కొన్నారు.

# అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవు

**వేటపాలెం,పెన్ పవర్,జనవరి 29**

అర్ధరాత్రి పూట అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ ను వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు తన సిబ్బందితో కలిసి దిగమర్రు జాతీయ రహదారిపై పట్టుకున్నారు. ఇసుక రవాణాకు సంబంధించి డ్రైవర్ వద్ద ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో ఇసుక లోడుతో సహా ట్రాక్టర్ ను వేటపాలెం పోలీస్ స్టేషన్ కి తరలించారు. ముద్దాయిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.పూర్తిస్థాయి నిఘా పెట్టి నిరంతరం దాడులు చేస్తామన్నారు.



పెన్ పవర్
గుంటూరు। బాపట్ల। పల్నాడు

## వైకాపా ప్రభుత్వ హయాంలో జగన్ చేసిన

# ఆర్థిక విధ్వంసం రూ.10 లక్షల కోట్లు అప్పు

### బాపట్ల నియోజకవర్గ శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు

**పెన్ పవర్ బ్యూరో బాపట్ల జనవరి 29**

ఏడాదికి రూ.71 వేల కోట్లు అసలు, వడ్డీ చెల్లింపు భారం. లక్షా 40 వేల కోట్లు చెల్లింపు భారం... ఆర్థిక వ్యవస్థ దివాళా గడచిన 7 నెలల్లో ఆరోగ్యశ్రీ, ధాన్యం బకాయిలు, ఫీజు రీయంబర్స్ మెంట్ లాంటి జగన్ ప్రభుత్వ బకాయిలు రూ.22 వేల కోట్లను చంద్రబాబు ప్రభుత్వం చెల్లించింది. అప్పులు కూడ పుట్టని స్థితి ఏర్పడింది. ఏడాదికి రూ.71 వేల కోట్లు అసలు, వడ్డీ చెల్లించాలి. ఇవి చంద్రబాబు ప్రభుత్వానికి గుదిబండలా మారింది. జగన్ పెట్టిన బకాయిలు కొన్ని డిగ్రీ ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలు - రూ.2,832 కోట్లు ఫీజు రీయంబర్స్ మెంట్ - రూ.450 కోట్లు చిక్కిలు, కోడిగుడ్లు - రూ.256 కోట్లు వసతి దీవెన వసతి దీవెన రూ.989 కోట్లు ఆరోగ్య శ్రీ బకాయిలు రూ.1800 కోట్లు ధాన్యం బకాయిలు - రూ.1600 కోట్లు ఉద్యోగులకు బకాయిలు - రూ. 20,000 కోట్లు ఇరిగేషన్ కాంట్రాక్టర్ల బకాయిలు రూ.19,000 కోట్లు గృహ నిర్మాణం బకాయిలు - రూ.7,800 కోట్లు ఉపాధి హామీ బకాయిలు - రూ.2,100 కోట్లు ఇలా మొత్తం జగన్ ప్రభుత్వం పెట్టిన బకాయి రూ.1.40 లక్షల కోట్లు ఉన్నవి. ఈ స్థాయిలో గత ఏ ప్రభుత్వం బకాయిలు పెట్టలేదు. తెచ్చిన అప్పులు ప్రభుత్వ ఆదాయం పెంచే సాగునీటి ప్రాజెక్టులు, అమరావతి నిర్మాణం లాంటి వాటిపై కాకుండా విలాసాలు, జల్సాలకు ఖర్చు చేసి తినేశారు. జగన్ విలాసాలు, జల్సాలకు ప్రభుత్వ ధనం దుబారా రూ.19,871.35 కోట్లు సెంటు పట్టాల పేరుతో దోపిడీ - రూ.7,000 కోట్లు రేషన్ బియ్యంలో దోపిడీ - రూ.7,000 కోట్లు సచివాలయాలకు వైసీపీ రంగులు వేసేందుకు, తొలగించేందుకు - రూ. 3,000కోట్లు తాడేపల్లి ప్యాలెస్ వద్ద 986మంది సెక్యూరిటీ ఖర్చు - రూ. 1,000కోట్లు సర్వేరాళ్ల మీద జగన్ ఫోటోలకు ఖర్చు - రూ.700 కోట్లు రుషికొండపై విలాసవంతమైన భవన నిర్మాణం - రూ. 600కోట్లు ప్రకటనల పేరుతో సాక్షికి దోచిపెట్టిన మొత్తం - రూ. 500కోట్లు తాడేపల్లి ప్యాలెస్ నిర్వహణకు ప్రజాధనం ఖర్చు రూ. 15.25కోట్లు పట్టాదారు పాస్ పుస్తకాలపై జగన్ ఫోటోలు - రూ.13కోట్లు తాడేపల్లి ప్యాలెస్ కి ఐరన్ ఫెన్సింగ్ కోసం ప్రజాధనం ఖర్చు - రూ.12.85కోట్లు ప్యాలెస్



ప్రహరీ నిర్మాణానికి ప్రజాధనం ఖర్చు - రూ. 10కోట్లు తాడేపల్లి ప్యాలెస్ లో పెన్ను, పేపర్ల ఖర్చు - రూ.9.84కోట్లు ప్యాలెస్ ముందు రోడ్డు నిర్మాణం కోసం ఖర్చు - రూ. 5కోట్లు జగన్ జమానాలో ఎగ్ పఫ్ లు తినడానికి అయిన ఖర్చు - రూ.3.6కోట్లు మద్యం షాపుల్లో ఎలుకలు పట్టడానికి అయిన ఖర్చు - రూ. 1.36కోట్లు జగన్ ఫ్యామిలీతో పర్సనల్ టూర్ ఖర్చు - రూ. 22.52లక్షలు ప్యాలెస్ లో తాత్కాలిక పనుల ఖర్చు - రూ. 22.50లక్షలు మొత్తం - రూ. 19,871.35 కోట్లు జగన్ రెడ్డి కుటుంబ లూటీ రూ.8 లక్షల కోట్లు అయిదేళ్లలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని జగన్ రెడ్డి రూ.8 లక్షల కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టారు. భూకేటాయింపులు, గనుల తవ్వకాలు, సోలార్ కు అనుమతులు.. ఇలా ప్రతి దాంట్లో ఆశ్రిత పక్షపాతానికి ఒడిగట్టి లక్షల కోట్లు సంపాదించారు. ఆంధ్రప్రదేశ్ గుండెకాయ లాంటి సచివాలయాన్ని కూడా తాకట్టుపెట్టాడు. టీడీఆర్ బాండ్లు, స్మార్ట్ మీటర్ల కొనుగోళ్లు రేషన్ బియ్యంలో చేతివాటం చూపారు. చివరికి చిన్నారుల పోషణకు పెట్టే చిక్కీలు, కోడిగుడ్లు వంటి వాటిల్లో కూడా పెద్ద ఎత్తున అవినీతి అక్రమాలకు పాల్పడ్డాడు. లిక్కర్ కమిషన్ - రూ. 1,05,000 కోట్లు 2.22(ఎ), అసైన్డ్ భూముల కుంభకోణం - రూ.1,00,000 కోట్లు.ఇండోసోల్(జగన్ బినామీ) కుంభకోణం - రూ.75,000 కోట్లు జి.ఐ.ఎస్ విద్యుత్ ఒప్పందాల కుంభకోణం - రూ.50,000 కోట్లు టీడీఆర్ బాండ్ల కుంభకోణం రూ.50,000 కోట్లు విశాఖ భూముల కుంభకోణం రూ.40,000 కోట్లు ఇసుక దోపిడీ రూ.60,000 కోట్లు ఎర్రచందనం కుంభకోణం - రూ.25,000 కోట్లు గ్రావెల్ దోపిడీ - రూ.22,000 కోట్లు సిలికా, బీచ్ శాండ్, క్వార్ట్జ్ దోపిడీ - రూ.17,000 కోట్లు గంజాయి, డ్రగ్స్ వాటా రూ.37,000 కోట్లుప్రభుత్వ కొనుగోళ్లలో కమిషన్లు రూ.16,000 కోట్లు కూకట్పల్లిలో ఎకరాలు, లేపాక్షి భూములు - రూ. 15,000 కోట్ల స్మార్ట్ మీటర్లు, ట్రాన్స్ ఫార్మర్ల కొనుగోలు, తదితరాల్లో - రూ. 15,000 కోట్లు కోవిడ్ మందులు, కిట్ల కొనుగోళ్లలో - రూ.14,000 కోట్లు భారతి సిమెంట్ దోపిడీ - రూ.12,000 కోట్లు రేషన్ బియ్యం కుంభకోణం - రూ.7,000 కోట్లు ఇళ్ల స్థలాల కొనుగోలు కుంభకోణం - రూ.7,000 కోట్లు బైజూస్, విద్యా కానుక, నాడు-నేడు - రూ.4,500 కోట్లు పోర్టుల్లో అవినీతి - రూ.4,000 కోట్లు సాగునీటి ప్రాజెక్టుల్లో కమిషన్లు - రూ.2,500 కోట్లు సాక్షికి ప్రకటనల రూపంలో దోపిడీ - రూ.1,600 కోట్లు అమూల్ కమిషన్ - రూ.1,000 కోట్లు జే ట్యాక్స్ - రూ.40,000 కోట్లు సీబీఐ ఛార్జిషీట్లో నిర్ధారించినవి - రూ.43,000 కోట్లు సీబీఐ నిర్ధారించాల్సిన ఆస్తుల విలువ - రూ.60,000 కోట్లు మొత్తం - రూ. 8,23,600 కోట్లు ఈ కారణాలన్నింటివల్ల ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ దివాళా తీసింది. ఇది నేటి చంద్రబాబు ప్రభుత్వానికి గుదిబండగా తయారైంది. ప్రజలపాలిట శాపంగా మారిందని బాపట్ల నియోజకవర్గ శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు తెలిపారు.

# సెయింటాన్స్‌లో ముగిసిన వియల్‌యస్ఐ డిజైన్ వర్క్ షాపు



**వేటపాలెం, జనవరి 29 (పెన్ పవర్)**

స్థానిక సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజిలో హైదరాబాద్ కల్కి టెక్నాలజీస్ ఆధ్వర్యములో ఇ.సి.ఇ విభాగ మూడవ సం. విద్యార్థులకు మూడు రోజుల పాటు నిర్వహించిన వియల్‌యస్ఐ డిజైన్ వర్క్‌షాపు బుధవారంతో ముగిసినట్లు కళాశాల సెక్రటరి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ యస్. లక్ష్మణరావు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. జగదీష్ బాబు మాట్లాడుతూ విద్యార్థులు తాము నేర్చుకున్న సాఫ్ట్‌వేర్లతో నూతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టినయెడల అద్భుతాలను సృష్టించవచ్చని తెలిపారు. వి.యల్.యస్.ఐ డిజైన్ పై మూడు రోజుల వర్క్‌షాపును నిర్వహించినట్లు ఇ.సి.ఇ విభాగాధిపతి డా. డి. రాజెంద్ర ప్రసాద్ తెలియజేశారు. ఈ మూడు రోజుల వర్క్ షాపులో ఆధునిక టెక్నాలజీలపై అవగాహవన కల్పించినట్లు పేర్కొన్నారు. కల్కి టెక్నాలజీస్ నుండి వివేక్, వారి బృందము ఆధ్వర్యములో వి.యల్.సి.ఐ డిజైన్ ఫ్రంట్ ఎండ్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించి వివాడో సాఫ్ట్‌వేర్ ద్వారా ప్రయోగాలను నిర్వహించారని తెలియజేశారు. ఈ వర్క్‌షాపుకు డా. డి.వి.యన్ సుకన్య, జె. కవిత కోఆర్డినేటర్లుగా వ్యవహరించారు. ఈ సందర్భముగా జరిగిన ముగింపు సభలో ఇ.సి.ఇ విభాగ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆధార్ అప్‌డేట్ ప్రక్రియ నిర్వహణ



**వేటపాలెం, జనవరి 29 (పెన్ పవర్):**

మండలంలోని రామన్నపేట పంచాయతీ నందు ఐసిడిసిస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఆధార్ అప్‌డేట్ ప్రక్రియ మంగళవారం నిర్వహించారు. ఐసీడీఎస్ జిల్లా అధికారి కె. ఉమ ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ కూడా చిన్న పిల్లలు ఆధార్ అప్‌డేట్ కేంద్రాన్ని వినియోగించుకోవాల్సిందిగా, తల్లిదండ్రుల బయోడేటాతో ప్రతి ఒక్కరూ కూడా ఆధార్ తీసుకోవాల్సిందిగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆధార్ అప్డేట్ ఆఫీసర్ మహేష్, అంగన్వాడి కార్యకర్తలు అనురాధ, అలివేలుమంగ, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాలపై అవగాహన సదస్సు

**ఇంకొల్లు , పెన్ పవర్, జనవరి 29**

ఇంకొల్లు సర్కిల్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో స్థానిక కళ్యాణమండపం నందు ప్రజలకు హెల్మెట్ పై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సర్కిల్ సీఐ నాగభూషణం పాల్గొని రోడ్డు ప్రమాదాలపై నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను గురించి ఆయన ప్రజలకు వివరించారు.ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని సిఐ సూచించారు.



# సమాజ సేవలో మాజీ సైనికులు ముందుండటం అభినందనీయం

### బాపట్ల జిల్లా మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎంపీటీసీ తాండ్ర సాంబశివరావు




**పెన్ పవర్ బ్యూరో బాపట్ల జనవరి 29:**

విజయనగరానికి చెందిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ మాజీ సైనిక సంక్షేమ సంఘం సభ్యులు మాజీ సైనికులు పి మన్మథ రావు వయసులో చిన్న వాడు అయినప్పటికీ సమాజ సేవలో ముందుదటం అభినందనీయం అని బాపట్ల జిల్లా మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షులు మరియు ఎంపీటీసీ సభ్యులు తాండ్ర సాంబశివరావు కొనియాడారు. భారతదేశానికి రక్షణ వలయంగా సేవలు అందిస్తున్న త్రిదళాలలో ఒకటైన నావికా దళం నుండి రిటైర్మెంట్ అయిన తరువాత కూడా బాధ్యత కలిగిన మాజీ సైనికుడిగా సమాజ సేవ ను కొనసాగిస్తూ తమ నేతాజీ మాజీ సైనిక సంఘం యొక్క వార్షికోత్సవం దినోత్సవం సందర్భంగా 24 వ సారి రక్త దానం చేయటం స్ఫూర్తి దాయకం అని కొనియాడి, ప్రతి ఒక్కరూ మాజీ సైనికుడు మన్మథరావును ఆదర్శంగా తీసుకోవాలి అని ఎంపీటీసీ తాండ్ర సూచించారు. విజయనగరంలోని యూత్ హాస్టల్ లో మాజీ సైనికులు ఏర్పాటు చేసిన రక్త దాన శిబిరాన్ని సందర్శించిన సందర్భంగా 24 వ సారి రక్త దానం చేసిన మాజీ సైనికుడు పి మన్మథ రావు కు విజయ బ్లడ్ సెంటర్ విజయనగరం వారిచే జారి చేయబడిన ప్రశంసా పత్రాన్ని అందజేసి మెమోంటో తో సత్కరించారు.

## ఫిబ్రవరి 1 నుండి ద్విచక్ర వాహనదారులు

# తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి

### బాపట్ల డిఎస్పీ రామాంజనేయులు

### ద్విచక్ర వాహనదారుడితో పాటు వెనక కూర్చున్న వ్యక్తి కూడా హెల్మెట్ ధరించాలి.

**పెన్ పవర్ బ్యూరో బాపట్ల జనవరి 29**

ఫిబ్రవరి నుండి చలనాలు విధిస్తాం ద్విచక్ర వాహనదారుడికి హెల్మెట్ లేనిచో 1000 జరిమానా ఎవరి ప్రాణాలు వారు కాపాడుకోవడానికి తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి బాపట్ల పట్టణ ప్రజలు రూరల్ ప్రజలు ద్విచక్ర వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని బాపట్ల డిఎస్పీ రామాంజనేయులు అన్నారు. బాపట్ల పట్టణ, రూరల్, సర్కిల్ పోలీసులు ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ పై అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బాపట్ల డిఎస్పీ రామాంజనేయులు హాజరయ్యారు. బాపట్ల పోలీసులు ద్విచక్ర వాహనాలపై హెల్మెట్ పెట్టుకుని బాపట్ల పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద నుండి క్లాక్ టవర్ రథం బజార్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బాపట్ల డిఎస్పీ రామాంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు అధికారుల ఆదేశాల మేరకు బాపట్ల పట్టణంలో మరియు





చుట్టుపక్కల ప్రాంతాలలో తప్పనిసరిగా హెల్మెట్ ను అమలు పరచడం జరుగుతుంది. ఫిబ్రవరి 1 నుండి తప్పనిసరిగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని అన్నారు.వెనక కూర్చున్న వ్యక్తి కూడా హెల్మెట్ ధరించాలని అన్నారు.హెల్మెట్ లేకపోతే 1000 రూపాయల వరకు జరిమానా విధిస్తామని అన్నారు. ఈ మధ్యకాలంలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా ద్విచక్ర వాహనదారులకు జరుగుతున్నాయని హెల్మెట్ లేకపోవడం వల్ల ప్రాణాలు కోల్పోతున్నారు వాటిని నివారించడానికి హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని అన్నారు ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ రాంబాబు,సర్కిల్ సీఐ హరికృష్ణ,రూరల్ సీఐ శ్రీనివాసరావు, పట్టణ ఎస్సై విజయ్ కుమార్, పట్టణ ఎస్సై చంద్రావతి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మెగా జాబ్ మేళా ని సద్వినియోగం చేసుకోండి

**టిడిపి సీనియర్ నాయకుడు మందపాటి ఆంధ్రయ**



**పెన్ పవర్ బ్యూరో బాపట్ల జనవరి 29:**

బాపట్ల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా మెగా జాబ్ మేళాని బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే, వేగేశన ఫౌండేషన్ చైర్మన్ వేగేశన నరేంద్ర వర్మ రాజు ఆధ్వర్యం లో జరగటం బాపట్ల ప్రజలు చేసుకున్న అదృష్టమని, బాపట్ల చరిత్రలో మెగా జాబ్ మేళా నిర్వహించడం ఇదే మొదటి సారి అని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు మందపాటి ఆంధ్రయ అన్నారు ఈ సందర్భంగా మాట్లాడుతూ వేగేశన ఫౌండేషన్ %ఇ%మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండషన్ సౌజన్యంతో ఈ నెల 31వ తేదీ న బాపట్ల నియోజకవర్గ నిరుద్యోగ యువతీ,యువకులకు మెగా జాబ్ మేళా ని నిర్వహిస్తున్నారు 50కి పైగా కంపెనీలు, 1000కి పైగా ఉద్యోగ అవకాశాలు.. అర్హత 10వ తరగతి నుండి పిజి వరకు, జాబ్ మేళా కు వచ్చేవారు ఆధార్ కార్డు,పాస్ పోర్ట్ సైజు ఫోటో , విద్యార్హత సర్టిఫికెట్లు తీసుకురావలెను. రిజిస్ట్రేషన్ ఉచితం, స్థలం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, ఎజి కాలేజీ ఎదురు, సూర్యలంక రోడ్డు, బాపట్ల, రిజిస్ట్రేషన్ కొరకు సంప్రదించండి : 8500015566,8179192707.

# పల్నాడు జిల్లాలో ఎల్చూరు యువకుడు దుర్మారణం



**పెన్ పవర్, జనవరి 29, అద్దంకి**

బ్రతుకుదెరువు కోసం ట్రాక్టర్ డ్రైవర్ గా వెళ్తూ అదే ట్రాక్టర్ కింద పడి యువకుడు దుర్మరణం చెందిన సంఘటన బుధవారం జరిగింది. పల్నాడు జిల్లాలోని శావల్యాపురం మండలం గంటావారిపాలెం సమీపంలోని వేల్పూరు రహదారి వద్ద ఈ ప్రమాదం చోటుచేసుకుంది.వివరాలలోకి వెళితే మండలం లోని ఎల్చూరు గ్రామానికి చెందిన బండారు ఫణింద్ర (27) ఎల్చూరు గ్రామం నుండి ట్రాక్టర్ లో వెస్ట్ రాళ్ళ ను పల్నాడు జిల్లాలోని వినుకొండ వైపుకు తీసుకెళ్తుండగా గంటావారిపాలెం దాటిన తరువాత వేల్పూరు వెళ్లే రహదారి దగ్గరకు వచ్చే సమయానికి ట్రాక్టర్ టైరు కు పంక్చర్ కావడంతో ట్రాక్టర్ రహదారి మార్జిన్ లో బోల్తా కొట్టింది . ఫణింద్ర పై రాళ్లు పడటంతో అక్కడిక్కడే దుర్మరణం చెందాడు. మృతి చెందిన ఫణింద్ర కు ఎనిమిది నెలల క్రితం వివాహం జరిగింది. ఈ సంఘటన తో ఎల్చూరు గ్రామంలో విషాదఛాయలు ఆలముకున్నాయి.

# మట్టి మాఫియా బారి నుంచి శానంపూడి గ్రామాన్ని కాపాడండి

**రాత్రి అయితే చాలు మట్టి మాఫియా ఆగడాలు**


**మట్టి మాఫియా ఆగడాలను అధికారులు అదుపు చేయలేకపోతున్నారా.?**

**సింగరాయకొండ పెన్ పవర్, జనవరి 29**

మండలంలోని శానంపూడి గ్రామంలో ఉన్న ఎర్ర మట్టిని తొవ్వుకొని సొమ్ము చేసుకునేందుకు పలువురు తయారయ్యారు. అధికారులు వచ్చి పట్టుకునే ప్రయత్నం చేయగా మేము రాజకీయ నాయకులు అంటూ అధికారులను భయపెడుతూ పలువురు రాజకీయ బడా నాయకుల పేర్లతో అధికారులను భయపెడుతున్నారు. గత ప్రభుత్వంలో కూడా ఇలాగే జరిగిందని కొన్ని పత్రికల్లో కథనాలు వచ్చాయి. నూతన ప్రభుత్వం ఏర్పడిన వాటి నుంచి అన్ని శాఖలకు ఉత్తర్వులు జారీ చేస్తున్నప్పటికీ ఈ మైనింగ్ శాఖ మాత్రం నిద్ర మత్తులో ఉంది. ఇదే ఆసరాగా తీసుకున్న పలువురు మైనింగ్ మాఫియా నాయకులు పగలు రాత్రి తేడా లేకుండా భారీ జెసిబి లతో టిప్పర్లు పెట్టి మట్టిని తరలిస్తున్నారు. దీని వల్ల శానంపూడి రహదారి గుంతల మాయం అవుతూ ప్రయాణికులకు ఇబ్బంది గా మారింది. పర్యవరణానికి ముప్పు అవుతుంది.

# శ్రీ బగళాముఖీ అమ్మవారి ఆలయానికి దేవినేని ఉమా దంపతులు





**పెన్ పవర్ బ్యూరో బాపట్ల జనవరి 29:**

చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ బగలాముఖి అమ్మవారి ఆలయానికి మాజీ మంత్రివర్యులు దేవినేని ఉమామహేశ్వరరావు దంపతీ సమేతంగా ఆలయానికి విచ్చేశారు ఈరోజు కుంభమేళా.. లో మౌని అమావాస్యసందర్భంగా ఆలయానికి విచ్చేసి ఆలయంలో గుమ్మడికాయ దీపం వెలిగించి అమ్మవారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు అమ్మవారి సన్నిధిలో విశేష హోమాలు నిర్వహించారు ఈ సందర్భంగా ఉమా మాట్లాడుతూ ఇటువంటి ప్రముఖ క్షేత్రం ప్రాశస్త్యం తెలిసిన వెంటనే నేను రావడం జరిగిందని ఇండియా చీఫ్ జస్టిస్ రావడం కూడా చాలా సంతోషదాయకమని ఇటువంటి ఆలయాన్ని అన్ని విధాల అభివృద్ధి పథంలో నడిపించడం అభినందనీయమని తెలియపరిచారు ఈ సందర్భంగా బాపట్ల, పొన్నూరు, శాసనసభ్యులు నరేంద్ర వర్మ రాజు ధూళిపాళ్ల నరేంద్ర తో మాట్లాడుతూ ఆలయానికి రావాలంటే పొన్నూరు చందోలు రోడ్డు చాలా అద్వాన్నంగా ఉందని దానిని బాగు చేయిస్తే భక్తుల రాక ఆలయానికి ఇంకా పెరుగుతుందని తెలియపరిచారు ఆలయానికి సంబంధించి ఎటువంటి అవసరమైన తనని సంప్రదించవచ్చునని ఆలయ కార్యనిర్వహణాధికారికి సూచించారు ఈ కార్యక్రమంలో కాకినాడకు చెందిన వేద పండితుల ఆధ్వర్యంలో పూర్ణాహుతి కార్యక్రమాలు వైభవంగా జరిపించామని నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# సీసీ కెమెరాల పూర్తి పర్యవేక్షణలో కందుకూరు






**కందుకూరు పెన్ పవర్ జనవరి 29**

నెల్లూరు జిల్లాలోనే సీసీ కెమెరాల పూర్తి పర్యవేక్షణలో ఉన్న ఏకైక పట్టణం కందుకూరు కావడం ఆనందదాయకమని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక టౌన్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఇనాగరేషన్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే ఇంటూరి మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో మాచర్లలో జరిగిన దాడి ఘటనలను తాను ప్రత్యక్షంగా చూచానన్నారు. అలాంటి ఘటనలు జరగకుండా సుపరిపాలన అందించడమే తమ కూటమి ప్రభుత్వ అభిమతమని ఎమ్మెల్యే నాగేశ్వరరావు చెప్పారు. దాతలు సీసీ కెమెరాల ఏర్పాటుకు 10 లక్షల రూపాయలు అందించడం అభినందనీయమన్నారు. ఇటీవల మహదేవపురం రోడ్లో జరిగిన యాక్సిడెంట్ కేసు చేదించడంలో సీసీ కెమెరాలు ప్రధాన పాత్ర పోషించాయని ఎమ్మెల్యే చెప్పారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల వ్యాపారస్తులు ధైర్యంగా ఉండవచ్చు అన్నారు. రాబోయే రోజుల్లో ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవలసిన అవసరం, ఆవశ్యకత ఏర్పడుతుందని ఆ దిశగా ప్రజలు కూడా ఆలోచించాలని ఎమ్మెల్యే నాగేశ్వరరావు చెప్పారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ, ఎమ్మెల్యే నాగేశ్వరరావు 1లక్ష రూపాయలు సీసీ కెమెరాల ఏర్పాటుకు ఇచ్చారని, సీసీ కెమెరాలు ఏర్పాటుకు త్వరితగతిన పూర్తయ్యే విధంగా సహకరించారని ప్రశంసించారు. అనంతరం పోలీస్ అధికారులు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును దుశ్యాలు వాతో ఘనంగా సన్మానించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు కు డాక్టర్లు అసోసియేషన్ 3.80 లక్షలు., బులియన్ మర్చంట్ అసోసియేషన్ 3. లక్షలు, లాడ్జిలు రెస్టారెంట్ల బాధ్యులు, 1.10లక్షలు, ఫర్టిలైజర్స్ అసోసియేషన్ వారు 50,000.., రైస్ మర్చంట్ అసోసియేషన్ 45000 ..,లక్ష్మీ స్రవంతి ట్రావెల్స్ వారు 10000 ఇచ్చినట్లు డివైఎస్పీ తెలియజేశారు. వారందరికీ ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేస్తూ.. శాలువాలు, మెమొంటోలతో సత్కరించారు. కార్యక్రమంలో కందుకూరు సిఐ వెంకటేశ్వరరావు, గుడ్లూరు సిఐ మంగారావు, పట్టణ, రూరల్ ఎస్సైలు సాంబశివయ్య, మహేంద్ర నాయక్ తెదేపా నాయకులు దామా మల్లేశ్వరరావు వడ్లమూడి సురేష్ ,ముచ్చు శ్రీను, ముచ్చు వేణు, డాక్టర్ తన్నీరు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ఇంటూరిని మర్యాదపూర్వకంగా కలిసిన గుడ్లూరు మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు



**కందుకూరు పెన్ పవర్ జనవరి 29**

ఇటీవలే గుడ్లూరు మండల ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన అమరా మాల్యాద్రి బుధవారం కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ని మర్యాదపూర్వకంగా కలసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతనంగా ఎన్నికైన ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు అమరా మాల్యాద్రికి , వారి కార్యవర్గాన్ని అభినందించారు. ఆర్యవైశ్యులకు ఏ అవసరం వచ్చినా తాను అండగా ఉంటానని అన్నారు. ఆర్యవైశ్యులకు కూటమి ప్రభుత్వం అన్ని విషయాల్లో సహాయ సహకారం అందిస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ ఎయిర్టెల్ చిన్న, ప్రధాన కార్యదర్శి గరటయ్య, బిజెపి నాయకులు ఇన్నమూరి సుధాకర్ రావు, కందుకూరు ఆర్యవైశ్య నాయకులు మురారిశెట్టి సుధీర్ కుమార్, చక్కా వెంకట కేశవరావు, కోటా కిషోర్ బాబు, కంకణాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# ఐసిడిఎస్ పిడిగా అదనపు బాధ్యతలను చేపట్టిన డ్వామా పిడి గంగాభవాని

**బ్యూరో పెన్ పవర్, నెల్లూరు జనవరి 29**

జిల్లా డ్వామా ప్రాజెక్ట్ కార్యాలయ పిడి బి.గంగాభవాని ఐసిడిఎస్ పిడి అదనపు భాధ్యతలను ఐసిడిఎస్ కార్యాలయంలో బుధవారం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు అధికారులు, సిబ్బంది మర్యాదగాపూర్వకంగా కలిసి అభినందించారు.





# కేసరి గుంట కాలనీలో కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్






**కందుకూరు పెన్ పవర్, జనవరి 29**

పట్టణంలోని గల కేసరిగుంట కాలనీలో కందుకూరు డిఎస్పి సిహెచ్ వి బాలసుబ్రమణ్యం పర్యవేక్షణలో ఇద్దరు సిఐలు, ఐదు మంది ఎస్సైలు 55 మంది పోలీస్ సిబ్బందితో కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా కందుకూరు డిఎస్పి మాట్లాడుతూ ఈ కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ లో సరైనటు వంటి ఆధార పత్రాలు లేని 37 బైకులను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు మరోసారి



వాటి రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి చట్టపరమైన చర్యలు తీసుకొనబడును అని తెలిపారు. అదేవిధంగా తరచు ఇలాంటి కార్డెన్ అండ్ సెర్చ్ ఇతర ప్రాంతాల్లో కూడా నిర్వహించి ఇలాంటి అసాంఘిక కార్యక్రమాలకు తావు లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ ఆపరేషన్లు కందుకూరు సిఐ కే. వెంకటేశ్వరరావు, గుడ్లూరు సిఐ మంగారావు, కందుకూరు సబ్ డివిజన్ లోని ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

## ఉత్తమ అవార్డు అందుకున్న తాసిల్దార్‌ను సత్కరించి విఆరోఓలు



**గిద్దలూరు పెన్ పవర్ జనవరి 29**

గిద్దలూరు తాసిల్దార్ కార్యాలయంలో రిపబ్లిక్ డే సందర్భంగా ఉత్తమ అవార్డు అందుకున్న తాసిల్దార్ ఎమ్. ఆంజనేయరెడ్డి ని ఆర్ ఐ జి భాస్కర్ రావును జిల్లా వి ఆర్ ఓ ల సంఘం అధ్యక్షులు వై పి రంగయ్య ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు వి ఆర్ ఓ లు ,వి ఆర్ ఎ ల తో పాటు ,కార్యాలయ సిబ్బంది. డీ టి ఏ.నాయబ్ ఖాజా హుస్సేన్ వి ఆర్ ఓ మండల సంఘం అధ్యక్షులు వెంకట రామయ్య,రాజశేఖర్ రెడ్డి,ఈశ్వరరెడ్డి, ఎన్. నాగేంద్రుడు, స్వర్ణలత,సంధ్యా తదితరులు పాల్గొన్నారు.

## ఈ -పంట నమోదుకు ఈ కే వై సి చేయండి

**అప్పుడే నష్టపరిహారంకు అర్హులు**



**గిద్దలూరు పెన్ పవర్ జనవరి 29**

గిద్దలూరు మండలంలో కొంగలవీడు తిమ్మాపురం గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి విజయ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో "పొలం పిలుస్తోంది" కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మాట్లాడుతూ ప్రస్తుతం మండలం లోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో గ్రామ వ్యవసాయ, ఉద్యాన , పట్టుపరిశ్రమ సహాయకులు ఈ- పంట కు సంబందించి ఈ-కే. వై. సి చేస్తున్నారు ఈ- పంట నమోదు చేసుకున్న ప్రతి ఒక్క రైతు కూడా తప్పనిసరిగా ఈ-కే. వై. సి చేసుకోవాలని, ఈ-కే. వై. సి చేసుకుంటేనే తుది ఈ-పంట జాబితా లో ఈ- పంట పూర్తి ఐపోయినట్లు వస్తుంది అప్పుడు మాత్రమే రైతులు ప్రభుత్వం ద్వారా వచ్చే అన్ని పధకాలకు పంట నష్టపరిహారం, పంటల భీమా, ధాన్య%ళి% కొనుగోలు మొదలైన వాటికి అర్హులు అవుతారు అని రైతులకు తెలిపారు. గ్రామ సభ అనంతరం శనగ పంటలు క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఆ పంటలలో వచ్చు చీడ పీడలు వాటి నివారణ చర్యలు రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీనివాస రెడ్డి,గ్రామ వ్యవసాయ సహాయకులు కళ్యాణి, భవాని , రైతులు పాల్గొన్నారు.

## ఉచిత పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



**కొనకనమిట్ల పెన్ పవర్ జనవరి 29**

మండలంలోని పెద్దారికట్ల గ్రామంలో బుధవారం పశు ఆరోగ్య శిబిరం పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకులు రాఘవయ్య ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ ఆరోగ్య శిబిరంలో 40 దూడలకు నట్టల నివారణ మందులు,30 గేదెలకు గర్భకోశ చికిత్సలు,22 గేదెలకు సాధారణ చికిత్సలు చేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఉప సంచాలకులు రాఘవయ్య మాట్లాడుతూ...ఉచిత పశు వైద్య శిబిరాలను రైతులు వినియోగించుకోవాలని గేదెలు,గొర్రెలు,మేకలకు క్రమం తప్పకుండా టీకాలు వేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యధికారి శ్రీకాంత్ రెడ్డి,సచివలయం సిబ్బంది,రైతులు పాల్గొన్నారు.

## కాశినాయన ఆశ్రమంలో అన్న ప్రసాద వితరణకు 10,1,116రూపాయలు విరాళం

**గిద్దలూరు పెన్ పవర్ జనవరి 29**

గిద్దలూరు పట్టణంలోని శ్రీ భగవాన్ కాశిరెడ్డి నాయన ఆశ్రమంలో ప్రతి బుధవారం భోజన సౌకర్యం ఏర్పాటు చేయాలనే కార్యక్రమం ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమానికి రామాంజనేయరెడ్డి విశ్రాంత ప్రధానోపాధ్యాయులు రూ10,1,116 రూపాయలు అన్న ప్రసాద వితరణకు విరాళంగా ఆశ్రమ కమిటీకి అందించారు.



# దివ్యాంగుల సంక్షేమానికి ఎన్డీయే ప్రభుత్వం కృషి

## ఎమ్మెల్యే సోదరుడు కృష్ణ కిషోర్







**గిద్దలూరు పెన్ పవర్ జనవరి 29**

దివ్యాంగుల సంక్షేమానికి ఎన్డీయే కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని గిద్దలూరు ఎమ్మెల్యే సోదరుడు కృష్ణ కిషోర్ రెడ్డి పేర్కొన్నారు . బి.పి ఎల్ తరగతికి చెందిన దివ్యాంగుల లింకో సంస్థ ఆధ్వర్యంలో , ప్రకాశం జిల్లా పరిపాలన యంత్రాంగం సహకారంతో గిద్దలూరు ప్రభుత్వ వైద్యాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన దివ్యాంగుల గుర్తింపు , పరికరాల పంపిణి కార్యక్రమంలో గిద్దలూరు ఎమ్మెల్యే సోదరుడు ముత్తుముల కృష్ణ కిషోర్ రెడ్డి పాల్గోన్నారు.. ఈ సందర్భంగా వైద్యశాలకు నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన దివ్యాంగులు హాజరయ్యారు.. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరుడు కృష్ణ కిషోర్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని దివ్యాంగులను గుర్తించి వారికీ పరికరాలు అందించటం చాలా అభినందించగల విషయం అన్నారు. గత వైకాపా పాలకుల దివ్యాంగుల సంక్షేమానికి చెప్పిన మాటలు కేవలం నీటిమూటలే నన్నారు కేవలం మాటలకే పరిమితమయ్యారన్నారు. 2014 నుంచి 2024 వరకు వైకాపా ప్రభుత్వం అన్ని వ్యవస్థ లను నాశనం చేశారని.ప్రజల కు ఇచ్చిన హామీలను ఏమాత్రం నెరవేర్చలేదన్నారు. విశ్వసనీయత అంటూ ప్రగల్భాలు పాలికిననాటి సీఎం జగన్మోహన్ రెడ్డి చివరకు ప్రజా విశ్వాసం కోల్పోయారని ఆరోపించారు. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి నియోజకవర్గంలోని దివ్యాంగుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నారని, భవిష్యత్తులో ఎటువంటి అవసరం ఉన్న, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తమ సమస్యలను పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు.. అనంతరం వైద్యశాల ప్రాంగణంలో దివ్యాంగులకు భోజనం వడ్డీంచారు. ఈ కార్యక్రమంలో ఏ డి ఐ పి అసిస్టెంట్ డైరెక్టర్, జి అర్చన, వైద్యశాల సూపరింటెండెంట్ ఆదాం, గిద్దలూరు నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య, కమిషనర్ వెంకటదాసు, పట్టణ అధ్యక్షులు సయ్యద్ శానేషా వలి, పట్టణ కౌన్సిలర్లు, నాయకులు, మానవతా సేవా సంస్థ సభ్యులు తదితరులు పాల్గోన్నారు.

# సామాజిక పెన్షన్లు పంపిణీ కార్యక్రమం విజయవంతం చేయాలి

**సూరవారిపల్లి గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించిన ఎంపీడీవో సయ్యద్ మస్తాన్ వలి**





**కొమరోలు పెన్ పవర్ జనవరి 29**

ఫిబ్రవరి ఒకటవ తేదీ నిర్వహించనున్న సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని సమర్ధవంతంగా నిర్వహించి విజయవంతం చేయాలని కొమరోలు ఎంపీడీవో సయ్యద్ మస్తాన్ వలి గ్రామ సచివాలయాల సిబ్బందిని కోరారు. బుధవారం ఎంపీడీవో మస్తాన్ వలి స్థానిక మండలం సూరవారిపల్లి లో గల గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఆ సందర్భంగా ఆయన గ్రామ సచివాలయ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి వారికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు .సిబ్బంది సమయపాలన పాటించాలని, సకాలంలో బయోమెట్రిక్ ద్వారా హాజరు నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు. ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తప్పనిసరిగా గ్రామ సచివాలయాల్లో ఉంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆయన కోరారు .గ్రామ సచివాలయ పరిధిలోగల గ్రామాలలో పారిశుధ్యం పనులు సక్రమంగా అమలు జరిగే విధంగా పర్యవేక్షించాలని కోరారు .రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామాలలో తాగునీటి ఎద్దడి లేకుండా చేసేందుకు ముందస్తుగా ప్రణాళికలు రూపొందించుకుని అమలు చేయాలని కోరారు. ప్రభుత్వము నిర్దేశించిన అన్ని రకాల సర్వేలను సకాలంలో పూర్తి చేయాలని ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని ఆయన ఆదేశించారు. ఫిబ్రవరి మాసానికి సంబంధించిన సామాజిక పెన్షన్ల కార్యక్రమం ఫిబ్రవరి ఒకటో తేదీన నిర్వహించనున్నామని ,అందువల్ల గ్రామ సచివాలయాల సిబ్బంది తమ కేటాయించిన పెన్షన్దారులకు సకాలంలో సామాజిక పెన్షన్లు పంపిణీ చేసి ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు విధుల పట్ల నిర్లక్ష్యం చేసే వారిని ఉపేక్షించబోమని ,వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవలసి వస్తుందని ఆయన హెచ్చరించారు .ఆ కార్యక్రమంలో గ్రామ సచివాలయ కార్యదర్శి అహల్య రాణి తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

# రహదారి భద్రత నియమాలు తప్పక పాటించాలి

**- ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత - రవాణా శాఖ ఆధ్వర్యంలో మహిళల బైక్ ర్యాలీ**



**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జనవరి 29**

మహిళలు ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ తప్పక ధరించాలని, అలాగే రహదారి భద్రత నియమాలను తూ.చా. తప్పక పాటించాలని ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత అన్నారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలలో భాగంగా బుధవారం ఉప రవాణా కమిషనర్ ఆర్.. సుశీల ఆధ్వర్యంలో మహిళలతో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని నగర మేయర్ గంగాడ సుజాత, ఉప రవాణా కమిషనర్ ఆర్. సుశీల సంయుక్తంగా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు హెల్మెట్ ధారణతో ప్రాణాపాయం నుండి బయటపడవచ్చని, మీతో పాటు మీ కుటుంబ సభ్యులకు కూడా హెల్మెట్ ధారణ ఆవశ్యకతను తెలియజేసి హెల్మెట్ ధరించేలా చేయాలని ఆమె కోరారు. మహిళల బైక్ ర్యాలీ జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి ప్రారంభమై కోర్టు సెంటర్, పద్మాలయ బేకరీ, సాయిబాబా గుడి, కళానికేతన్, మంగమూరు రోడ్డు జంక్షన్, ఎస్పీ కార్యాలయం, అద్దంకి బస్టాండు, కొత్తపట్నం బస్టాండ్ మీదుగా కలెక్టర్ ఆఫీస్ వరకు జరిగినది. అనంతరం మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళ సబ్ ఇన్స్పెక్టర్లు, మహిళా కానిస్టేబుల్స్, మెప్మా మహిళా ఉద్యోగులు, వివిధ కాలేజీల విద్యార్థినులు, ఎన్జీవో మహిళా నాయకులు, వివిధ ద్విచక్ర వాహన షోరూమ్ లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు, మోటార్ వాహన తనిఖీ అధికారులు ఏ. కిరణ్ ప్రభాకర్, కే రామచంద్రరావు, ఎల్ సురేంద్ర ప్రసాద్, జి భాస్కరరావు, సహాయ మోటారు వాహన తనిఖీ అధికారులు యు. ధర్మేంద్ర, భాను ప్రకాష్, ఏఓ ఎం. శ్రీనివాసరావు, రవాణా శాఖ సిబ్బంది, హోమ్ గార్డులు పాల్గొన్నారు.

## శ్రీగిరిలో భక్తి శ్రద్ధలతో శ్రీవారి ఆస్థానం - శాస్త్రోక్తంగా శ్రవణా నక్షత్ర పూజలు





**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జనవరి 29**

శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని బుధవారం సాయంత్రం ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరీ పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శ్రీవారి ఆస్థానం కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు వేద పండితులు శ్రీవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు.

నాద నీరాజనం.. చతుర్వేద పారాయణ.. విష్ణు సహస్ర నామ పారాయణ జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి,కార్య నిర్వహణ ధర్మకర్త సి వి రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వేంకటేశ్వర రావు, ఆలూరు లక్ష్మీ కుమారి తదితరులు పర్యవేక్షించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు శ్రీవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

## గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలి

**- శాప్ చైర్మన్ రవి నాయుడుతో ఎమ్మెల్యే ఏలూరి భేటీ**

**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జనవరి 29**

గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. బుధవారం మంగళగిరి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శాప్ చైర్మన్ రవి నాయుడుతో ఎమ్మెల్యే ఏలూరి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ యువత శారీరక దారుఢ్యాన్ని పెంపొందించుకొని మెరుగైన ఆరోగ్యంతో మెలిగేలా కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా క్రీడల అభివృద్ధికి రవి నాయుడు చేస్తున్న కృషిని ఎమ్మెల్యే ఏలూరి అభినందించారు. శారీరక దారుఢ్యాన్ని,ఆరోగ్యంపెంపొందించుకునేలా ప్రతి ఒక్కరిని ప్రోత్సహించాలన్నారు.యువత మానసిక ఉల్లాసం కోసం ఏర్పాటు చేసిన ఏలూరి యూత్ ఫిట్నెస్ సెంటర్ సందర్శించానని, క్రీడా వికాస కేంద్రాలను ప్రత్యేక శ్రద్ధతో అభివృద్ధి పరుస్తున్నాయని రాష్ట్ర శాప్ చైర్మన్ రవి నాయుడు పేర్కొన్నారు. నియోజకవర్గాల్లో వివిధ ప్రాంతాల్లో ఇండోర్ స్టేడియంలో పెద్ద ఎత్తున నిర్మించిన ఘనత తెదేపా ప్రభుత్వానికి చెందుతుందన్నారు. ఈ సందర్భంగా ఇసుక దర్శి ఏలూరి క్యాంపు కార్యాలయంలో యూత్ ఫిట్నెస్ కోసం జిమ్ లను ఏర్పాటు చేయడంపై రవి నాయుడు ఏలూరిపై ప్రశంసలు కురిపించారు.



# పొదిలిలో అవార్డులు అందుకున్న అధికారులను సన్మానించిన గునుపూడి









**పొదిలి, పెన్ పవర్ జనవరి 29**

ప్రజలకు ఉత్తమ సేవలు అందించినందుకు గాను పొదిలికి చెందిన పలువురు అధికారులు ఇటీవల ఒంగోలులో జరిగిన 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా జిల్లా కలెక్టర్ తమీం అన్సా రియా, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ ఏ.ఆర్ దామోదర్ ల చేతులమీదుగా ఉత్తమ అవార్డులు అందుకున్నారు కాగా ఈ సందర్భాన్ని పునస్కరించుకొని బుధవారం నాడు అవార్డులు అందుకున్న మండల తహసిల్దార్ ఎం వి కృష్ణారెడ్డి, పొదిలి పోలీసు సర్కిల్ ఇన్స్పెక్టర్ టి వెంకటేశ్వర్లు, మండల పోలీసు సబ్ ఇన్స్పెక్టర్ వివేమన, మండల పోలీసు అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ టీవీ సత్యనారాయణ లను రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి, ఆర్యవైశ్య సంఘం నాయకులు గునుపూడి భాస్కర్ ఘనంగా సన్మానించారు ఆయా అధికారులను వారి కార్యాలయాల్లో కలసి శాలువలతో సత్కరించి, తమ అభినందనలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ షేక్ జిలాని భాష, మైనారిటీ నాయకులు షేక్ యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగపరుచుకోవాలి

### మండల వ్యవసాయాధికారి జైను లాబ్దిన్





**పొదిలి, పెన్ పవర్ జనవరి 29**

ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగ పరుచుకోవడం ద్వారా రైతులు ఆర్థికంగా ఎదగాలని మండల వ్యవసాయాధికారి షేక్ జైను లాబ్దిన్ కోరారు బుధవారం నాడు మండలంలోని కంబాలపాడు, నంది పాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి జైను లాబ్దిన్ ఆయా గ్రామాల్లో ని రైతులతో సమావేశం జరిపి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు అలాగే ఆయా గ్రామాల్లోని రైతులు సాగుచేసిన పంటలను పరిశీలించి, ఆయా పంటల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలను రైతులకు అర్థమయ్యే రీతిలో వివరించారు రైతులు రబీ సీజన్ లో సాగు చేసిన పంటల వివరాలను విధిగా నమోదు చేయించుకోవాలని, అలాగే ఈ కేవైసీ కూడా చేయించుకోవాలని వ్యవసాయాధికారి సూచించారు అందువల్ల ప్రభుత్వ పరంగా రైతులకు సాయం అంది అవకాశాలు ఉంటాయని ఆయన చెప్పారు మండల ఉద్యానవన అధికారి డి సంధ్య మాట్లాడుతూ ఉద్యానవన శాఖలో అమలు జరుగుతున్న ప్రభుత్వ పథకాల గురించి రైతులకు వివరించారు రైతులు మోతాదుకు మించి నత్రజని ఎరువును వాడకూడదని ఆమె సూచించారు ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి జైనులబ్దిన్, సంధ్య లతోపాటు వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పదవతరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ పంపిణీ



**అర్ధవీడు, పెన్ పవర్ , జనవరి 29**

ప్రకాశం జిల్లా అర్ధవీడు మండలం యాచవరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో చిన్ని ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్ మెంట్ సొసైటి ఆధ్వర్యంలో పదవతరగతి చదువుతున్న విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పత్తి శ్రీనివాసులు ఆధ్వర్యంలో పదవతరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ పంపిణీ చేయడం బుధవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చిన్ని ఎడ్యుకేషనల్ రూరల్ డెవలప్ మెంట్ సొసైటీ అధ్యక్షులు మాగులూరి శ్రీకాంత్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బి యస్ నారాయణరెడ్డి, సంఘ సేవకులు నేస్తం ఫౌండేషన్ వ్యవస్థాపకులు బి రవి తేజలు మాట్లాడుతూ విద్యార్థులు అందరూ క్రమ శిక్షణతో చదివి పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించాలని అన్నారు. చదువు ఉన్నత స్థాయికి చేరుస్తుందని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ పదవతరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ పంపిణీ చేసిన చిన్ని ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్ మెంట్ సొసైటి అధ్యక్షుడు మాగులూరి శ్రీకాంత్ ను అభినందించారు. రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని అన్నారు. ఈ సందర్భంగా మాగులూరి శ్రుకాంత్ ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి వి కృష్ణయ్య , వై శ్రీనివాసులు, షేక్ సనావుల్లా, కే గురవయ్య, టి కాశి రావు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# అదుపుతప్పి మోటార్ బైక్ బోల్తా ఇరువురికి స్వల్ప గాయాలు

### గాయపడిన ఇరువురు ఉపాధ్యాయుడు సి వి సుబ్బారెడ్డి, దంపతులుగా గుర్తింపు



**కొమరోలు పెన్ పవర్ జనవరి 29**

వేగంగా వెళుతున్న ద్విచక్ర వాహనానికి కుక్క అడ్డు రావడంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడింది .ఆ సంఘటనలో మోటర్ బైక్ పై ఉన్న కొమరోలు కు చెందిన ఉపాధ్యాయుడు సి వి సుబ్బారెడ్డి ఆయన భార్య కు స్వల్ప గాయాలు అయ్యాయి.ఈ సంఘటన బుధవారం సాయంత్రం గిద్దలూరు తాటిచెర్ల మోటు మధ్య ఎడవల్లి బస్ స్టేజిసమీపంలో జరిగింది. సివి సుబ్బారెడ్డి కొమరోలు మండలం ఎర్రంశెట్టివాని పల్లె ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఆయన తన భార్యతో తన మోటార్ బైక్ పై తాటిచెర్ల మోటు మీదుగా గిద్దలూరు కు వెళ్తున్నారు .కాగా మార్గమధ్యంలోని ఎడవల్లి బస్ స్టేజి సమీపంలో ఆకస్మికంగా మోటర్ బైక్ కు కుక్క అడ్డు రావడంతో సుబ్బారెడ్డి కుక్కను తప్పించే ప్రయత్నంలో మోటార్ బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. ఆ సంఘటనలో సుబ్బారెడ్డికి, ఆయన భార్యకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే వారు ఇరువురిని గిద్దలూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

# చింతలపాలెంలో వక్స్ బోర్డ్ భూములుఅన్యాక్రాంత అయ్యాయి

### జిల్లా వక్స్ బోర్డ్ ఇన్స్పెక్టర్ మహమ్మద్ భాష



**బెస్తవారిపేట, పెన్ పవర్ జనవరి 29**

బెస్తవారిపేట మండలంలోని నీకు నా బాధ గ్రామపంచాయతీ పరిధిలోని చింతలపాలెం గ్రామంలో వక్స్ బోర్డ్ భూమి దాదాపు 14 ఎకరాలు అన్యాక్రాంతమైనట్లు ప్రకాశం జిల్లా వక్స్ బోర్డ్ ఇన్స్పెక్టర్ అహమ్మద్ బాషా తెలిపారు. బుధవారం బెస్తవారిపేట మండలం చింతలపాలెం రెవెన్యూ పరిధిలోని అన్యాక్రాంతమైన వక్స్ బోర్డ్ భూములను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అహ్మద్ భాష మాట్లాడుతూ చింతలపాలెం రెవిన్యూ పరిధిలోని 71 సర్వే నెంబర్లు నాలుగు ఎకరాల 38 సెంట్లు, 83 సర్వే నెంబర్లో 1.47 సెంట్లు, 86 సర్వే నెంబర్లో 1.82 సెంట్లు,101 సర్వే నెంబర్ లో ఒక ఎకరా, 170 సర్వే నెంబర్లులో ఆరు ఎకరాల 18 సెంట్లు అన్యాక్రాంతమైనట్లు గుర్తించారు. జిల్లా వక్స్ బోర్డు అధికారుల ఆదేశాల మేరకు తాను వక్స్ బోర్డు భూములను పరిశీలించినట్లు పేర్కొన్నారు. ఈ భూములలో గతంలో ఎవరైనా ఆక్రమించినా, రిజిస్ట్రేషన్లు జరిగివున్న, కన్యాక్రాంతంగా ఇల్లు నిర్మించుకున్న వారి యొక్క జాబితాను తయారు చేయాలని బేస్తవారిపేట తాసిల్దార్ జితేంద్రకు రిప్రజెంటేషన్ ఇవ్వడం జరిగిందన్నారు. తాసిల్దార్ జితేంద్ర కుమార్ ఇచ్చిన జాబితాను ప్రకాశం జిల్లా వర్ఫ్ బోర్డ్ అధికారుల ఆధ్వర్యంలో రాష్ట్ర వక్స్ బోర్డ్ సి ఓ కు నివేదిక అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం వక్ఫ్బర్డ్ భూములను అన్యాక్రాంతం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది అందులో భాగంగా ప్రకాశం జిల్లాలోని వక్స్ బోర్డు భూములను పరిశీలించి తగిన చర్యలు తీసుకోనున్నట్లు మహమ్మద్ భాషా తెలిపారు.

# సుప్రీంకోర్టు ఇచ్చిన వర్గీకరణ తీర్పును వెంటనే అమలుచేయాలి

### 4న మాధిగ మేధావుల సదస్సును జయప్రదం చేయాలని పిలుపు



**ఆర్ సి ఇన్ చార్జీ యర్రగొండపాలెం పెన్ పవర్ జనవరి 29**

సుప్రీంకోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ తీర్పును రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే అమలు పరచాలని యం ఆర్ పి యస్ నాయకులు డిమాండ్ చేసారు.బుదవారం మాదిగ మేదావుల సదస్సును జయప్రదం చేయాలని కోరుతు కరపత్రాన్ని వారు ఆవిష్కరించారు.ఈ సందర్బంగా నాయకులు మాట్లాడుతు ఫిబ్రవరి 4.న ఉదయము 10 గంటలకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆడిటోరియంలో జరుగు మాదిగ మేధావుల సదస్సుకు వేలాదిగా డప్పులతో కదలిరావాలని,మన భవిష్యత్తుకు బాటలు వేసుకునేందుకు, ఎస్సీ వర్గీకరణ సాధించుకుందాం అని తెలియజేశారు. నాటి నుంచి నేటి వరకు మాదిగలు, మాదిగ ఉప కులాలు అణచివేతకు అక్రమాలకు గురవుతూ ప్రభుత్వం అందిస్తున్న రిజర్వేషన్ ఫలాలను పొందలేక పోతున్నామని, అనేక సంవత్సరాల నుండి మాదిగలు మాదిగ ఉప కులాలు చేసే పోరాటాలకు స్పందించిన భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్ర సూడ్ అధ్యక్షతన ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనం అనుకూలంగా తీర్పు ఇచ్చి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణను అమలు చేసుకోవచ్చుని చెప్పడం జరిగిందని అన్నారు.ఎన్డీఏ కూటమి ప్రభుత్వం, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అసెంబ్లీలో బిల్లు పెట్టి వర్గీకరణను వెంటనే అమలు చేయాలని యర్రగొండపాలెం నియోజకవర్గ మేధావుల సదస్సు డిమాండ్ చేస్తుందని తెలియజేశారు. అనంతరంమాదిగ మేధావుల సదస్సు కరపత్రాన్ని ఆహ్వాన కమిటీ ఆవిష్కరించింది. కార్యక్రమంలోపీటర్ మాదిగ, తిరుమలయా మాదిగ, గర్నపూడి వినయ్ మాదిగ, సింగ ప్రసాద్ మాదిగ, ఉప్పలపాటి రమేష్ మాదిగ, కొండయ్య మాదిగ, సుధాకర్ మాదిగ, కొర్రపోలు వెస్లీ మాదిగ, రాసిటి ప్రసాద్ మాదిగ, ముటుకూరి రాజు మాదిగ, ముటుకూరి కన్నబాబు మాదిగ, నాసరయ్య మాదిగ, దాస్ మాదిగ, చేదూరి అశోక్ మాదిగ, విజయ్ మాదిగ, షేక్ బాషాలు పాల్గొన్నారు.

# కంది పంటను పరిశీలించిన గుంటూరు లాం ఫామ్ శాస్త్రవేత్తలు





**బేస్తవారిపేట, పెన్ పవర్ జనవరి 29**

బేస్తవారిపేట మండలంలోని పూసలపాడు మరియు పందిల్లపల్లి గ్రామాలలో డిసెంబర్ నెలలో కురిసిన వర్షాలకు జరిగిన నష్టాన్ని మరియు ప్రస్తుత కంది పంట దిగుబడి అంచనా వేయుటకు జిల్లా వ్యవసాయ శాఖ పంపిన నివేదిక ఆధారంగా ప్రభుత్వం నియమించిన శాస్త్రవేత్తల బృందం గుంటూరు లాం ఫామ్ మరియు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల బృందం బుధవారం పరిశీలించారు.కంది ప్రధాన శాస్త్రవేత్త ఎం మోహన్ రెడ్డి మరియు ఎన్ సాంబ శివా రెడ్డి గారు, కె.వి శివా రెడ్డి మరియు కృషి విజ్ఞాన కేంద్రం దర్శి నుండి ప్రధాన శాస్త్రవేత్త పి సంధ్యా రాణి, జి రమేష్ , కంది పంటను పరిశీలించి జరిగినది. మండల వ్యవసాయాధికారి జక్కం మెర్సీ మాట్లాడుతూ 2227 మంది రైతులు 3538 ఎకరాల్లో సాగు చేసినట్లు, కంది పూత రాలిపోయి ఉన్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారులకు తెలియజేయడం జరిగిందన్నారు. పూసలపాడు పందిళ్ళపల్లి తదితర గ్రామాల్లోని రైతులతో మాట్లాడి ప్రస్తుత కంది పైరు యొక్క పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పూర్తి నివేదికను ప్రభుత్వానికి పంపుతున్నట్లు తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో గుంటూరు లాం ఫామ్ మరియు కృషి విజ్ఞాన కేంద్రం అధికారులతో పాటు సిబ్బంది మరియు గిద్దలూరు సహాయ వ్యవసాయ సంచాలకులు డి బాలాజీ నాయక్, మండల వ్యవసాయాధికారి జక్కం మెర్సీ, గ్రామ వ్యవసాయ సహాయకులు నవీన్, సరస్వతీ మరియు రైతులు పాల్గొన్నారు.

# సబ్ జైల్ ను తనిఖీ చేసిన న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి



**గిద్దలూరు పెన్ పవర్ జనవరి 29**

గిద్దలూరు లోని సబ్ జైల్ ను జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ సెక్రటరీ, కె. శ్యాంబాబు బుధవారం తనిఖీ చేశారు. విచారణలో ఉన్న ఖైదీలను ఉంచే గదులను, అందులోని సదుపాయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సదుపాయాలు బాగున్నాయా అని విచారణ ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. వారిపై ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేసుల నుండి బయటకు వచ్చినవారు క్రమశిక్షణతో మెలగాలన్నారు. న్యాయవాదిని పెట్టుకునే ఆర్థిక స్తోమత లేని వారు ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేసుకోవచ్చని, సంబంధిత మండల న్యాయసేవాధికార సంస్థకు అర్జీ పెట్టుకోవచ్చన్నారు.అరెస్టు, బెయిల్, ఉచిత న్యాయ సహాయం గురించి తెలియజేశారు .విచారణలో ఉన్న ఖైదీలు బెయిల్ కోసం అప్లికేషన్ పెట్టుకోవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సబ్ జైల్ ఇన్చార్జి సూపర్డెంట్ పి. రవీంద్రనాథ్ ,లీగల్ ఎయిడ్ న్యాయవాది చల్లగాలి. పోలయ్య, పారా లీగల్ వాలంటీర్ అద్దంకి.మధుసూధనరావు, సబ్ జైల్ సిబ్బంది మరియు విచారణలో ఉన్న ఖైదీలు పాల్గొన్నారు.


# ఐటీ హబ్ గా విశాఖ

**విశాఖపట్టణం, జనవరి 29, పెన్ పవర్:** ఏపీని టెక్నాలజీ రంగంలోనూ ముందు వరుసలో నిలపాలని భావిస్తున్న కూటమి ప్రభుత్వం.. రాష్ట్రానికి అంతర్జాతీయ టెక్ సంస్థల్ని తీసుకురావాలని భావిస్తోంది. ఐటీ రంగంలో అగ్రగామి నగరాల్లో ఒకటిగా ఉన్న హైదరాబాద్ మోడల్ ను అనుసరించి ఏపీలోనూ టెక్ రంగానికి సరికొత్త అవకాశాలు కల్పించాలనుకుంటోంది. ఇందులో భాగంగా ఇప్పటికే ఐటీ సంస్థలకు కావాల్సిన మౌలిక వసతుల కల్పనపై ఇప్పటికే దృష్టి పెట్టిన సర్కార్.. టెక్ సంస్థల కోసం ప్రత్యేక సిటీని నిర్మించాలని తలపెట్టింది. రానున్న రోజుల్లో టెక్ రంగంలో మంచి అభివృద్ధికి అవకాశం ఉన్న డేటా సెంటర్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆవిష్కరణల కోసం ఒక హబ్‌ను ఏర్పాటు చేయాలనే భావిస్తోంది. ఇందుకోసం.. సముద్ర తీర పట్టణం విశాఖకు సమీపంలో ప్రతిష్టాత్మకమైన "డేటా సిటీ"ని నిర్మించాలని నిర్ణయించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్న ఎన్నికల హామీలో మోజార్టీ ఉద్యోగాలను ఈ ప్రాజెక్టు ద్వారానే నెరవేర్చాలని భావిస్తోంది.విశాఖపట్నం సమీపంలోని మధురవాడలో 500 ఎకరాల్లో ఈ డేటా సిటీని నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఈ సిటీ కేంద్రంగానే.. ఐటీలోని విభిన్న కేటగిరీల్లో సేవలందించే ఐటీ సంస్థలకు స్థానం కల్పించనున్నారు. గతంలో ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు.. హైదరాబాద్ లో సైబర్ టవర్స్ ను నిర్మించారు. దాని కేంద్రంగా అనేక అంతర్జాతీయ ఐటీ సంస్థలకు ఆఫీస్ స్పేస్ కల్పించి.. అనేక సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేలా ఆకర్షించగలిగారు. సరిగా.. ఇప్పుడు కూడా అలానే విశాఖలో ఐటీ సంస్థలకు భారీ స్థాయిలో ఆఫీస్ స్పేస్ అందుబాటులోకి తీసుకువచ్చి, పెట్టుబడుల్ని ఆకర్షించనున్నారు. ఈ ఐటీ సిటీ.. టెక్నాలజీ, ఇన్నోవేషన్‌లో అగ్రగామిగా ఉండాలనే ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే.. అంతర్జాతీయంగా అనేక దిగ్గజ టెక్ దిగ్గజాలు రాష్ట్రంలో పెట్టుబడులకు ఆసక్తి కనబరుస్తున్న నేపథ్యంలో.. ప్రభుత్వం సైతం భూ సేకరణకు కసరత్తు ప్రారంభించింది.ఇప్పటికే.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర




ప్రభుత్వంతో కొన్ని సంస్థలు ఒప్పందాలు చేసుకున్నాయి. వాటిలో గూగుల్ ఒకటి. ఈ సంస్థ ఏపీ రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం (ఎంఓయు)పై సంతకాలు చేసింది. ఆ సంస్థ భారీ డేటా సెంటర్ ను ఏర్పాటు చేస్తుండగా, ఇందుకోసం 80 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం అందించనుంది. అదే విధంగా, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ 30 ఎకరాల్లో ఐటీ ప్రాంగణాన్ని నెలకొల్పనుండగా, ఇక్కడి నుంచి కార్యకలాపాలు విస్తరించేందుకు సిద్ధంగా ఉందని ప్రకటించిందిదావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ (డబ్ల్యూఈఎఫ్)లో జరిగిన కీలక చర్చల తర్వాత ఆంధ్రప్రదేశ్ ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ రూపొందించిన డేటా సిటీ కాన్సెప్ట్ ఊపందుకుంది. రాష్ట్రానికి డేటా సెంటర్లు, ఎఐ హబ్‌లను తీసుకురావడానికి లోకేశ్ టెమాసెక్ హోల్డింగ్స్, కాగ్నిజెంట్‌తో సహా ప్రముఖ సంస్థలతో చర్చలు జరిపారు.ఐటీ మంత్రి నారా లోకేష్ దావోస్ పర్యటనలో ఐటీ సంస్థలు, డేటా సెంటర్లు, అల్ డీప్ టెక్ సంస్థలు ఏపీలో పెట్టుబడులకు ఆసక్తి ఉన్నట్లు గుర్తించినట్లు వెల్లడించారు. అందుకోసమే.. ఆయా సంస్థలకు మంచి వసతులు కల్పించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం.. వైజాగ్ సమీపంలో ఐటీ సంస్థలన్నింటినీ కేంద్రీకృతం చేసేలా ప్రత్యేక ప్రాజెక్టు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు.

# చంద్రబాబు సాఫ్ట్ కార్నర్ పై గుస్సా..



**ఏలూరు, జనవరి 29, పెన్ పవర్:** వైసీపీ ప్రభుత్వంలో బాధితులు గా ఉన్న వారి విషయంలో చంద్రబాబు సానుకూల ధృక్పదంతోనే ఉన్నారు.. వారిలో కొందరికి నామినేటెడ్ పదవులు కూడా కట్టబెడుతున్నారు.. అయితే పార్టీ కేడర్ని ఇబ్బందులకు గురి చేసిన వారి విషయంలోనూ సాఫ్ట్ కార్నర్ చూపించడం సొంత పార్టీ నేతలకు మింగుడు పడటం లేదంట. దాంతో వారి విషయంలో కఠిన చర్యలు తీసుకుంటారా లేదా అన్న ఒత్తిడి పెంచేస్తున్నారంట.వైసీపీ ప్రభుత్వంలో మంగళగిరిలోని టీడీపీ ప్రధాన కార్యాలయం ధ్వంసం, చంద్రబాబు నివాసంపై దాడి వంటి దౌర్జన్యాలు ఎన్నో జరిగాయి. అప్పటి నరసాపురం ఎంపీ రఘురామకృష్ణం రాజుని వైసీపీ సర్కారు తీవ్రంగా వేధించిందన్న ఆరోపణలున్నాయి. గతంలో వైసీపీ ప్రభుత్వంపై పోరాటం చేసి సీఐడీ కస్టడీలో టార్చర్ అనుభవించిన ప్రస్తుత అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు..కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అప్పట్లో తనపై దాడి చేసిన వారిపై కేసు పెట్టారు. అయితే ఈ కేసులో ఇద్దరు సీనియర్ ఐపీఎస్ అధికారులు పీవీ సునీల్ కుమార్, పీఎస్సార్ ఆంజనేయుల్ని ఏ1, ఏ2లుగా చేర్చిన ప్రభుత్వం ఇప్పటివరకూ వారిని అరెస్టు చేయలేదు. అలాగే విచారణకు సైతం పిలవడం లేదు. ఈ వ్యవహారాన్ని జీర్ణించుకోలేకపోతున్న డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు తనకు న్యాయం జరుగుతుందన్న నమ్మకం ఉందంటూ పరోక్షంగా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతున్నారు.ఐపీఎస్ అధికారులు పీవీ సునీల్ కుమార్, పీఎస్సార్ ఆంజనేయుల్ని ఎందుకు సస్పెండ్ కూడా చేయడం లేదో ప్రశ్నించాల్సిన వారిని త్వరలోనే ప్రశిస్తానంటూ రఘురామ టీజర్ రిలీజ్ చేశారు. దీంతో చంద్రబాబు ప్రభుత్వం ఇప్పుడు కచ్చితంగా వారిపై ఏదో ఒక చర్య తీసుకోవాల్సిన పరిస్దితి ఎదురవుతోంది. తాజాగా ఇదే కేసులో రఘురామ గుండెలపై కూర్చుని టార్చర్ చేశాడని ఆరోపణలు ఎదుర్కొంటున్న కామేపల్లి తులసిబాబును పోలీసులు అరెస్టు చేశారు. జైల్లో తులసిబాబు ఐడెంటిఫికేషన్ పెరేడ్‌కు వెళ్లిన ఆర్ఆర్ఆర్ అతన్ని గుర్తుపట్టి వచ్చారు. దీంతో మూడు రోజుల పాటు పోలీసు కస్టడీకి కోర్టు అప్పగించింది.అయితే ఈ కామేపల్లి తులసిబాబు టీడీపీ గుడివాడ ఎమ్మెల్యే అయిన వెనిగండ్ల రాము ప్రధాన అనుచరుడంటారు. దీంతో టీడీపీ తులసిబాబు విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. ఆర్ఆర్ఆర్‌పై దాడి చేసిన నిందితుడిని ఇంకా పార్టీలో ఉంచడం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. దీంతో పార్టీలోనూ అంతర్గతంగా ఎమ్మెల్యేనా, డిప్యూటీ స్పీకరా తేల్చుకోవాల్సిన పరిస్దితి ఏర్పడింది. వెనిగండ్ల రాము ఎన్నారై. ఆయనకు విజయవాడ ఎంపీ కేశినేని చిన్నితో పాటు పార్టీలో బలమైన నేతల అండ ఉందంట. అందుకే ఈ కేసుకు సంబంధించి చర్యల విషయంలో ప్రభుత్వం ఆచితూచి వ్యవహరిస్తోందంటున్నారు.అయితే తన యువగళం పాదయాత్రలో రెడ్ బుక్ ప్రకటన చేసిన టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్.. రెడ్‌బుక్‌లో నోట్ అయిన వారిని ఎవరినీ వదిలి పెట్టే ప్రసక్తి లేదంటున్నారు. విదేశాల్లో కూడా అదే చెప్పుకొస్తున్నారు. గత ప్రభుత్వం అక్రమాలపై ఒక్క సారిగా విచారణలు జరిపి చర్యలు తీసుకోవాలంటే లా అండ్ ఆర్డర్ పోలీసులు సరిపోరని, కాలక్రమేణా అందరిపై చర్యలుంటాయని స్పష్టం చేస్తున్నారు.ఒక వైపు ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి లోకేష్‌లు అదే విషయాన్ని పదేపదే విషయాన్ని చెప్తున్నప్పటికీ.. ప్రభుత్వం ఏర్పడి నెలలు గడిచిపోతున్నా చర్యలు ఎప్పుడు తీసుకుంటారని కూటమి శ్రేణులు అసహనం వ్యక్తం చేస్తున్నాయి. మరి ఆ కన్‌ఫ్యూజన్‌కి కూటమి పెద్దలు ఎప్పుడు తెర దించుతారో అని మిత్రపక్షాల కేడర్ ఉత్కంఠగా ఎదురుచూస్తుంది.

# ఒంటరైన నందిగం...

**గుంటూరు, జనవరి 29, పెన్ పవర్:** వైసీపీ అధికారంలో ఉన్నంత కాలం ఆ నాయకుడి హవా మామూలుగా ఉండేది కాదు. పేరుకి ఎంపీనే అయినప్పటికీ తనదైన దూకుడుతో యావత్తు రాష్ట్రంలో ఫోకస్ అయ్యారు. సామాజిక వర్గం లెక్కలతో జగన్ కూడా ఆయనకు అంతే ప్రాధాన్యత ఇవ్వడంతో సదరు నేత ఆగడాలకు అడ్డు అదుపూ లేకుండా పోయింది. ఎప్పుడు కావాలంటే అప్పుడు ఆయనకు జగన్ అపాయింట్‌మెంట్ దొరికేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.. అప్పట్లో ఆయన దెబ్బకి స్థానిక ఎమ్మెల్యే కూడా బెంబేలెత్తిపోయారంట. వైసీపీలో అంత కీలకంగా వెలుగొందిన ఆయన ఇప్పుడు ఒంటరి అయ్యారు. లెటజ్ వాచ్‌ఉమ్మడి గుంటూరు జిల్లాలోని బాపట్ల పార్లమెంటు నియోజకవర్గం వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన నందిగామ సురేష్ 2019లో వీచిన వైసీపీ గాలిలో ఎంపీగా విజయం సాధించారు.. వైసీపీలో సామాన్య కర్యకర్తగా ఎంట్రీ ఇచ్చిన నందిగం సురేశ్? కూటమి అధికారంలో ఉన్నప్పుడు అమరావతి ప్రాంతంలో అధికార పక్షనాయకులు పంట పొలాలను తగులబెట్టి జగన్ దృష్టిలో పడ్డారు. దాంతో జగన్ బాపట్ల ఎస్సీ సెగ్మెంట్ నుంచి సురేష్‌బాబును జగన్ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించారు. ఆ ఎన్నికల్లో తన సమీప ప్రత్యర్థి తెలుగు దేశం పార్టీ అభ్యర్థి మాల్యాద్రి శ్రీరాం పై 16, 065 ఓట్ల మెజారిటీతో గెలిచి పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికయ్యారు.ఎలాంటి పొలిటికల్ బ్యాక్‌గ్రౌండ్ లేకపోయినా.. పెద్దగా ఆర్థిక స్థోమత లేకపోయినా జగన్ ఆయనకి టికెట్ ప్రకటించడం అప్పట్లో రాజకీయంగా పెద్ద చర్చకు దారితీసింది. అయితే ఆయన బాపట్ల ఎంపీగా గెలిచినా ఆయన ఎప్పుడూ కూడా గుంటూరు పార్లమెంటు నియోజకవర్గంలోని తాడికొండ నియోజకవర్గం నుంచే రాజకీయ నడిపారు. నందిగం సురేష్ స్వగ్రామం తాడికొండ సెగ్మెంట్లో ఉండటంతో ఆయన వ్యవహారాలన్నీ అక్కడి నుంచే నడిపించారు. ఆ క్రమంలో అప్పటి తాడికొండ వైసీపీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవితో ఆయనకు ఎప్పుడూ గొడవలు జరుగుతూనే ఉండేవి.ఆ ఇద్దరి పంచాయతీల్లో వైసీపీ అధిష్టానం ఎప్పుడూ నందిగం సురేష్‌కు బాసటగా నిలిచిందన్న ప్రచారం ఉంది. ఎమ్మెల్యేని ఎప్పటికప్పుడు బుజ్జగిస్తూ నందిగామ సురేష్ కి పార్టీ అధిష్టానం ఫుల్ సపోర్ట్ చేసిందంటారు. దానికి కారణం నందిగం సురేశ్ ప్రదర్శించే దూకుడే.. ముఖ్యమంత్రిగా జాగన్ ఏ పిలుపు ఇచ్చినా సురేష్ ముందుండేవారు. టీడీపీ కేంద్ర కార్యాలయానికి సంబంధించినటువంటి దాడి కేసులోనూ నందిగామ సురేష్ కీలకంగా ఉన్నారు. అమరావతి రాజధాని ఉద్యమాన్ని అణగదొక్కి, జగన్ గుడ్‌లుక్స్‌లో పడటానికి ఆయన చేయని ప్రయత్నం లేదంటారు.తాడికొండ నియోజకవర్గం తుళ్లూరు పరిధిలో ఆయన ఒక స్థావరాన్ని ఏర్పాటు చేసుకున్నారు ఆయన ఇంటితోపాటు అక్కడ కొన్ని స్థలాలను అక్రమంగా అక్రమించి ఒక ప్లేగ్రౌండ్ ఏర్పాటు చేసే వరకు ఆయన దౌర్జన్యాలు సాగాయి. అమరావతి ఉద్యమంలో ఎవరైతే కీలకంగా మారుతున్నారో వారిపై నిఘా పెట్టి.. వారికి సంబంధించినటువంటి ఇన్ఫర్మేషన్‌లన్నీ అధిష్టానానికి నందిగామ సురేష్ చేరవేసే వారంట. వైసీపీ ఎమ్మెల్సీ, రౌడీ షీటర్ అప్పి రెడ్డి ఏం చెప్తే అది చేసేవారంట. అప్పిరెడ్డికి ప్రధాన అనుచరుడు టిడిపి కేంద్ర కార్యాలయం దాడిలో మొదటి ముద్దాయిగా ఉన్న పానుగంటి చైతన్య ఎప్పుడు కూడా నందిగామ సురేష్‌తోనే ఉంటూ పంచాయతీలు చేసేవారంట.వైసీపీ హయాంలో ప్రతిపక్ష నేతలపై కూడా అనేకసార్లు దూకుడు ప్రదర్శించారాయన. టీడీసీ కేంద్ర కార్యాలయం పడి దాడి కేసులో నందిగామ సురేష్ ని అరెస్టు చేశాక ఆయనకి బెయిల్ వచ్చింది. అయితే 2020 డిసెంబర్‌లో రెండు సామాజిక వర్గాల మధ్య గొడవలు జరగడం.. ఒకరిపై మరొకరు రాళు రువ్వుకున్న ఘటనలో మరియమ్మ అనే మహిళ మృతి చెందింది. ఆమె కుటుంబ సభ్యులు ఇచ్చిన కంప్లైంట్ ఆధారంగా అప్పట్లో తుళ్లూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది. అయితే, ఈ కేసులో మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను 78వ నిందితుడిగా తుళ్లూరు పోలీసులు చేర్చారు. ఆ కేసుకు సంబంధించి ప్రస్తుతం నందిగామ సురేష్ డిమాండ్ ఖైదీగా ఉన్నారు.ఇదే కాకుండా రాజధాని అమరావతి ప్రాంతంలో పర్యటన చేస్తున్న సమయంలో ప్రస్తుత ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ పై దాడి చేసిన కేసులో నందిగామ సురేష్ పై కేసు నమోదు అయింది.. అయితే వరుస కేసులతో నందిగామ సురేష్ అల్లాడుతున్నారు. ప్రస్తుతం ఆ కేసులకు సంబంధించి ఆయన భార్య మాత్రమే బెయిల్ కోసం కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు .. పార్టీకి సంబంధించిన పెద్దలు ఎవరు కూడా నందిగామ సురేష్ కేసుల విషయంలో పెద్దగా ఇంట్రెస్ట్ గా చూపిస్తున్న పరిస్థితి కనిపించడం లేదు. పార్టీ నాయకులకు, కేడర్‌కు అండగా నిలుస్తామంటూ ఓటమి తర్వాత జగన్ జైలుకెళ్లి సురేష్‌ని పరామర్శించి వచ్చారు. అయితే తర్వాత పట్టించుకోవడం మానేశారంటవైసీపీ కీలక నేతలు ఎవరూ కూడా నందిగామ సురేష్‌ని పలకరించిన పాపాన పోవడం లేదంట. వారి కుటుంబానికి ధైర్యం చెపుతున్న పరిస్థులు ఎక్కడా కనిపించడం లేదు.. స్వయంగా నందిగామ సురేష్ భార్య తన కుటుంబానికి ఎవరూ అండగా నిలవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అధికారంలో ఉన్నప్పుడు ఆయన సొంత పార్టీ ఎమ్మెల్యేని ఇబ్బంది పెట్టడం, అధికారులను బెదిరించడం, ఇక అమరావతి రైతులపై అనుచితంగా ప్రవర్తించడం వంటివన్నీ ఇప్పుడు చుట్టుకుని.. ప్రస్తుతం ఆయన్ని పట్టించుకునే వారే లేకుండా పోయారంట.ఏది ఏమైనప్పటికీ ఉమ్మడి గుంటూరు జిల్లాకు సంబంధించి వైసీపీలో ప్రస్తుతం నందిగామ సురేష్ ఒంటరి అయ్యాడు అని స్పష్టంగా కనిపిస్తుంది. ఉమ్మడి గుంటూరు జిల్లాకు సంబంధించిన నేతలెవరు నందిగామ సురేష్ కి సంబంధించిన కేసులు వ్యవహారం గురించి కనీసం తెలుసుకునే ప్రయత్నాలు కూడా చేయడం లేదంట. తమ పరిస్థితి ఏంటో తెలియక చస్తుంటే ఇక వారి గురించి వీరి గురించి పట్టించుకునే తీరిక ఎక్కడుందని.. నందిగామ సురేష్ ప్రస్తావన వచ్చినప్పుడు కీలక నేతలు అంటున్నారంట. బళ్లు ఓడలు, ఓడలు బళ్లు అవ్వటమంటే ఇదేనేమో..

## స్వాతంత్ర సమరయోధులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి కేవి కేశవులు

-నేడు ఆయన వర్ధంతి

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )





తెలంగాణ రాష్ట్రానికి చెందిన స్వతంత్ర సమరయోధులు కర్నె వెంకట కేశవులు. ఈయన రాజకీయ నాయకుడిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జౌళి శాఖ సహకార మంత్రిగా పని చేశాడు.కె.వి.కేశవులు 1924 జనవరి 14న తెలంగాణ రాష్ట్రం జగిత్యాల జిల్లా ధర్మపురిలో జన్మించాడు. ఆయన విద్యాభ్యాసమంతా ధర్మపురిలో పూర్తి చేశాడు.

కె.వి.కేశవులు భారత స్వతంత్ర ఉద్యమంలో కీలకంగా పని చేస్తూ ఆంధ్రప్రదేశ్ స్వాతంత్ర సమరయోధుల సంఘం వ్యవస్థాపక కార్యదర్శిగా పని చేశాడు. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక హైదరాబాద్ (నైజాం) సంస్థానం భారతదేశంలో కలవలేదు. ఆయన నిజాం నిరంకుశపాలన గురించి ప్రజలను చైతన్య వంతులను చేయడం, వారి అరాచకాలను మొండిగా ఎదిరించి జాతీయ పతాకాన్ని రెప రెప లాడించి, నాటకాలు, సాహిత్యాలతో ప్రజలను కార్మోకులను చేయడంలో కీలక పాత్ర పోషించాడు. హైదరాబాద్ రాష్ట్రం భారతదేశం ప్రభుత్వ పాలనలో విలీనమైన తరువాత ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరాడు.

కె.వి.కేశవులు 1972, 1978లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సిర్పూర్ నియోజకవర్గం నుండి పోటీ చేసి రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి జౌళి శాఖ సహకార మంత్రిగా పని చేశాడు.30 జనవరి 2019లో వృద్ధాప్య కారణాలతో హైదరాబాద్ లో మృతి చెందారు.

# ఏపీలో ఏం జరుగుతోంది



**విజయవాడ, జనవరి 29, పెన్ పవర్::**రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకనే సంక్షేమ పథకాలను అమలు చేయలేదని చంద్రబాబు చెబుతున్నారు. రేపు జగన్ కూడా అలా అనరన్న గ్యారంటీ లేదు. చంద్రబాబు చెప్పినట్లు వరసగా అధికారం ఎవరికి ఇవ్వకపోయినా అభివృద్ధి పథకాలు ఆగిపోతాయి. అందులో ఆంధ్రప్రదేశ్ లో ప్రత్యేక రాజకీయాలున్నాయి. అందుకు రాజకీయ నేతలే కారణం. వ్యక్తిగత కక్షలతో ఏపీలో రాజకీయాలు చేసుకునే వారు ఎక్కువగా ఉన్నారు. ఇందులో ఎవరూ మరొకరికంటే తక్కువ కాదు. వైసీపీ అధికారంలో ఉండగా కమ్మ సామాజికవర్గం వారి ఆర్థిక మూలాలను చెరిపేయడానికి జగన్ ప్రయత్నించారు. అందులో నిజం లేకపోలేదు. ఎందుకంటే టీడీపీకి ఆర్థికంగా సాయం చేయగలిగిన వారిని ఆర్థికంగా లేవనివ్వకుండా కొట్టగలిగితే తాను ఎన్నికలలో సులువుగా విజయం సాధించాలని భావించి ఆ పనికి దిగారు. ఎన్ని విమర్శలు వచ్చినా జగన్ ఆ విషయంలో మాత్రం వెనక్కు తగ్గలేదు. అలాగే చంద్రబాబు 2014లో మొదలు పెట్టిన అనేక అభివృద్ధి పనులను తాను అధికారంలోకి రాగానే నిలిపేశారు. రాజధాని అమరావతి నిర్మాణాన్ని పూర్తిగా నిలిపేశారు. అమర్ రాజా వంటి కంపెనీలపై దాడులు చేశారు. పలు కంపెనీలు వెనక్కు పంపేలా చేశారు. ఎందుకంటే జగన్ ప్రాధాన్యతలు వేరు. ఆయన పూర్తిగా సంక్షేమంపైనే ఆధారపడి పాలన ఐదేళ్ల పాటు సాగించారు. తనకంటూ ఒక ప్రత్యేక ఓటు బ్యాంకు ఏర్పాటవుతుందని, తద్వారా తన గెలుపు మరోసారి సాధ్యమవుతుందని భావించారు. అందుకే ఆయన సంక్షేమ పథకాలకు దాదాపు ఐదున్నర లక్షల కోట్ల రూపాయలు లబ్దిదారులకు అందచేశారు. అప్పులు తెచ్చి మరీ సంక్షేమాన్ని అమలు చేయడానికి జగన్ ఏమాత్రం వెనకాడలేదు.. ఇక చంద్రబాబు అధికారంలోకి వచ్చీ రాగానే తన ప్రయారిటీ ఇదీ అని చెప్పకనే చెప్పారు. అమరావతి, పోలవరం నిర్మాణం తొలి ప్రాధాన్యత అని ఆయన చెప్పారు. అలాగే వాటికి వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. కానీ సంక్షేమానికి తన వద్ద డబ్బుల్లేవంటున్నారు. ఈయన ప్రాధాన్యతలు ఇవీ. జగన్ పెట్టిన పలు సంక్షేమ పథకాలకు పేరు మార్చారు. అంతే కాదు ఆరోగ్య శ్రీ వంటి పథకాలను కూడా ఎత్తివేయడానికి బీమా పథకాన్ని తెచ్చే యోచనను చంద్రబాబు చేశారు. అయితే ఎన్నికలకు ముందు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి చంద్రబాబుకు తెలియదా? అంటే అంతా తెలుసు. కానీ గెలుపు కోసం అలివికాని హామీ ఇచ్చారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం తానేమీ చేయలేనని అర్థం చేసుకోవాలంటూ జనాన్ని కోరుతున్నారు. జనం మాత్రం మొన్నటి వరకూ తమ బ్యాంకు ఖాతాల్లో ఏదో ఒక పథకం ద్వారా ప్రభుత్వం నుంచి డబ్బులు పడేవి. అయితే గత ఏడు నెలలుగా అవి అందడం లేదు. సహజంగా ఒకవర్గం ప్రజల్లో ఇది అసంతృప్తి ఎక్కువగానే ఉంది. వారంతా పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓట్లు వేసే వారే. కానీ ఎక్కువ మంది చంద్రబాబు ఆలోచనను కూడా సమర్థిస్తున్నారు. సంక్షేమం పేరుతో అభివృద్ధిని పూర్తిగా విస్మరిస్తే ఎలా? రాష్ట్రం ఇక ఎప్పుడు డెవలెప్ అవుతుంది? తమ తర్వాత తరం ఇబ్బందులు పడాల్సి వస్తుందోనన్న ఆందోళన ఎక్కువ మంది ప్రజల్లో ఉందని కూడా అంతే నిజం. అందుకే ఏపీలో ప్రభుత్వం మారినా ఒకరి పాలనపై మరొకరు సాకులు చెప్పుకుంటారు. వారిపై నెపం నెట్టే ప్రయత్నం చేస్తారు. ఇది ఫిక్స్.. ఇందులో ఏమాత్రం మార్పు ఉండదు. ఎన్నికలకు ముందు ఒకరీతిలో.. ఎన్నికల తర్వాత మరొక తీరులో వ్యవహరించడం ఏపీ పొలిటికల్ లీడర్స్ అందరికీ వెన్నతో పెట్టిన విద్య. మధ్యలో మాత్రం మోసపోయేది జనం మాత్రమేనన్న విశ్లేషణలు వినపడుతున్నాయి. మరి ఏపీని ఇక ఎవరూ బాగుపర్చే అవకాశం లేదా?

# మరీ దారుణంగా తిడుతున్నాడు.. బీసీసీఐకి కంప్లైంట్ చేసిన రోహిత్ !



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్‌లో గొడవలు మొదలయ్యాయి. మ్యాచ్ ఓడిన సందర్భాల్లో మాజీ క్రికెటర్లు చేస్తున్న దురుసు వ్యాఖ్యలపై భారత జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ బీసీసీఐకి ఫిర్యాదు చేసినట్లు క్రిక్‌బ్లాగర్ పేర్కొంది. ముఖ్యంగా, దిగ్గజ క్రికెటర్ సునీల్ గవాస్కర్‌పై హిట్‌మ్యాన్ బీసీసీఐ పెద్దలకు ఫిర్యాదు చేశారనేది వస్తున్న వార్తల సారాంశం.

**అసలేం జరిగిందంటే..?**

బోర్డర్- గవాస్కర్ ట్రోఫీ సమయంలో రోహిత్ కెప్టెన్సీపై, అతని ఆటతీరుపై గవాస్కర్ నాన్‌స్టాప్ విమర్శలు చేశారు. ఆ విమర్శలు మన క్రికెటర్లు ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లకముందే మొదలయ్యాయి. రోహిత్ భార్య రెండో బిడ్డకు జన్మనివ్వనుండటంతో.. మొదటి టెస్టుకు రోహిత్ దూరం కానున్నాడని బోర్డర్- గవాస్కర్ ట్రోఫీ ప్రారంభానికి వారం రోజుల ముందు విషయం బయటకొచ్చింది. అలా వార్తలొచ్చాయో .. లేదో సునీల్ గవాస్కర్ మీడియా ముందు వాలిపోయారు.

రోహిత్ గైర్హాజరీని అర్థం చేసుకుంటూనే, జట్టులో రెగ్యులర్ కెప్టెన్ అవసరాన్ని ప్రస్తావించాడు. ఒకవేళ రోహిత్ తొలి మ్యాచ్ ఆడలేకపోతే, అతన్ని పూర్తిగా తప్పించి.. జస్ప్రీత్ బుమ్రా కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టేందుకు అనుమతించాలని సూచించాడు. అలా మొదలైన విమర్శల పర్వం సిరీస్ అంతటా సాగింది. రెండో టెస్టుకు జట్టులో చేరిన హిట్ మ్యాన్.. తదుపరి మూడు మ్యాచ్‌ల్లో కేవలం 31 పరుగులు చేశాడు. దాంతో, గవాస్కర్ ఆ విమర్శల వేడిని మరింత పెంచాడు. టెస్టు క్రికెట్‌లో శర్మ భవిష్యత్తును ప్రశ్నిస్తూ, జట్టులో తన స్థానంపై అనుమానాలు ఉంటే కెప్టెన్ రిటైర్మెంట్ తీసుకోవాలని వ్యాఖ్యానించాడు. చివరకు గవాస్కర్ మాటలను భరించలేని రోహిత్.. ఏకంగా ఆఖరి టెస్ట్ నుంచి తప్పుకున్నాడు. ఆ సమయంలో రోహిత్.. ఎందుకు తప్పుకున్నాడని తెలియలేదు కానీ, అసలు సంగతి ఇదని ఇప్పుడు బయటకొచ్చింది. గవాస్కర్ తనను విమర్శించాల్సిన అవసరం లేదని రోహిత్ భావించాడని, అందుకే గవాస్కర్‌పై బీసీసీఐకి ఫిర్యాదు చేశాడని క్రిక్‌బ్లాగర్ పేర్కొంది.

**ఫామ్ అందుకొని రోహిత్..**

ఫేలవ ఫామ్‌తో సతమతవుతున్న రోహిత్ శర్మ.. దేశవాళీ క్రికెట్‌లోనూ ఆకట్టుకోలేకపోయాడు. జమ్మూ%డ% కాశ్మీర్‌తో జరిగిన రంజీ మ్యాచ్‌లో రెండు ఇన్నింగ్స్‌లలో కలిపి 31 పరుగులు(3,28) చేశాడు. ఇలాంటి ఆటతో ఛాంపియన్స్ ట్రోఫీలో ఏమాత్రం రాణించగలడనేది ఇప్పుడు ఎదురవుతోన్న ప్రశ్న.

# ఐసీసీ ర్యాంకింగ్స్.. ఐదో స్థానానికి వరుణ్ చక్రవర్తి




**హైదరాబాద్ పెన్ పవర్:** ఐసీసీ తాజాగా ప్రకటించిన టీ20 బౌలింగ్ ర్యాంకింగ్స్ లో టీమిండియా లెగ్ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి సత్తా చాటాడు. ఏకంగా 25 స్థానాలు ఎగబాకి టాప్ 5 లో స్థానం సంపాదించాడు. 679 రేటింగ్ పాయింట్లతో ఐదో స్థానంలోనిలిచాడు. ఇంగ్లాండ్ తో ప్రస్తుతం జరుగుతున్న సిరీస్ లో ఈ లెగ్ స్పిన్నర్ అద్భుతంగా రాణించాడు. తొలి మూడు టీ20ల్లోనే 7.08 ఎకానమీ రేట్‌తో ఏకంగా 10 వికెట్లు పడగొట్టాడు. రాజ్ కోట్ వేదికగా మంగళవారం (జనవరి 28) ఇంగ్లాండ్ తో జరిగిన మూడో టీ20 మ్యాచ్ లో 5 వికెట్లతో చెలరేగాడు. 4 ఓవర్లలో కేవలం 24 పరుగులే ఇచ్చి ఐదు వికెట్లకు పడగొట్టాడు. వరుస ఓవర్లలో జోస్ బట్లర్(24), జామీ ఓవర్టన్(0), జామీ స్మిత్(6), బ్రైడన్ కార్సే(6)లను పెవిలియన్ కు పంపాడు. రేటింగ్ పాయింట్లతో ఇంగ్లాండ్ స్పిన్నర్ ఆదిల్ రషీద్ టాప్ ర్యాంక్ కు చేరుకున్నాడు. అకేల్ హొసేన్ (707 రేటింగ్ పాయింట్లు), వనిందు హసరంగా (698 రేటింగ్ పాయింట్లు) ఆడమ్ జంపా (694 రేటింగ్ పాయింట్లు) వరుసగా రెండు, మూడు, నాలుగు స్థానాల్లో ఉన్నారు. టీ20 బౌలింగ్ ర్యాంకింగ్స్ లో టాప్ 5 లో స్పిన్నర్లే ఉండడం విశేషం. ఇంగ్లండ్ పేసర్ జోఫ్రా ఆర్చర్ 13 స్థానాలు ఎగబాకి ఆరో స్థానంలో నిలిచాడు. 718 రేటింగ్ పాయింట్లతో టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్ లో టీమిండియా యువ ఆటగాడు తిలక్ వర్మ రెండో స్థానానికి చేరుకోవడం విశేషం. ప్రస్తుతం జరుగుతున్న ఇంగ్లాండ్ సిరీస్ లో తిలక్ వర్మ వరుసగా 19బి, 72బి, 18 పరుగులు చేశాడు. ఆస్ట్రేలియా ఆటగాడు ట్రావిస్ హెడ్ నెం.1 ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. తిలక్ వర్మకు, హెడ్‌కి మధ్య కేవలం 23 పాయింట్లు వ్యత్యాసం ఉంది. సూర్య కుమార్ యాదవ్ నాలుగో ర్యాంక్ లో.. జైశ్వాల్ 9 వ ర్యాంక్ లో ఉన్నారు.

# శ్రీలంకపై సెంచరీ.. గవాస్కర్, లారాలను వెనక్కి నెట్టిన స్మిత్



**హైదరాబాద్ పెన్ పవర్:** గాలే వేదికగా శ్రీలంకతో బుధవారం (జనవరి 29) జరుగుతున్న తొలి టెస్టులో ఆస్ట్రేలియా తాత్కాలిక కెప్టెన్ స్టీవ్ స్మిత్ సెంచరీతో మెరిశాడు. కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడుతూ తొలి రోజు 104 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. స్మిత్ ఇన్నింగ్స్ లో 10 ఫోర్లు, ఒక సిక్సర్ ఉన్నాయి. తొలి పరుగు చేసి టెస్టుల్లో 10 వేల పరుగులు పూర్తి చేసుకున్న ఈ ఆసీస్ బ్యాటర్..టెస్ట్ కెరీర్ లో 35 వ సెంచరీ చేసి ఏకంగా నలుగురు దిగ్గజాలను వెనక్కి నెట్టాడు. సునీల్ గవాస్కర్, బ్రియాన్ లారా, యూనిస్ ఖాన్, జయవర్ధనే 34 సెంచరీలు చేయగా.. 35 వ సెంచరీతో స్మిత్ వీరిని అధిగమించాడు. టెస్ట్ క్రికెట్ లో ఆస్ట్రేలియా తరపున అత్యధిక సెంచరీలు చేసిన రెండో ఆటగాడు స్మిత్. 41 సెంచరీలతో పాంటింగ్ తొలి స్థానంలో ఉన్నాడు. ఓవరాల్ గా అత్యధిక సెంచరీలు చేసిన ఆటగాళ్ల లిస్టులో స్మిత్ 7 వ స్థానంలో నిలిచాడు. తొలి స్థానంలో 51 సెంచరీలతో సచిన్ ఉన్నాడు. ప్రస్తుత టెస్ట్ క్రికెట్ లో రూట్ తర్వాత అత్యధిక సెంచరీలు చేసిన బ్యాటర్ గా స్మిత్ కొనసాగుతున్నాడు. ఇటీవలే జరిగిన బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో స్మిత్ రెండు సెంచరీలు బాది ఫామ్ లోకి వచ్చాడు. అదే ఫామ్ ను శ్రీలంకపై కొనసాగిస్తున్నాడు.

ఈ మ్యాచ్ కు ముందు 9999 పరుగులతో బ్యాటింగ్ కు దిగిన స్మిత్.. బుధవారం (జనవరి 29) తొలి రోజు ఆటలో భాగంగా ప్రభాత్ జయసూర్య బౌలింగ్ లో మిడాన్ దిశగా సింగిల్ తీసి తన పదివేల మార్క్ అందుకున్నాడు. ఆస్ట్రేలియా తరపున పదివేల పరుగులు పూర్తి చేసుకున్న నాలుగో ఆటగాడు స్మిత్. అంతకముందు అలెన్ బోర్డర్, స్టీవ్ వా, రికీ పాంటింగ్ ఈ ఘనత అందుకున్నారు. ఓవరాల్ గా టెస్ట్ క్రికెట్ లో పదివేల పరుగులు పూర్తి చేసుకున్న 15వ ఆటగాడు స్మిత్. లారా, సచిన్, సంగక్కర, రికీ పాంటింగ్ తర్వాత వేగంగా 10 వేల పరుగులు పూర్తి చేసుకున్న ఆటగాడిగా రికార్డ్ సృష్టించాడు. ఈ మ్యాచ్ విషయానికివస్తే వస్తే తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా రెండు వికెట్ల నష్టానికి 330 పరుగులు చేసింది. సెంచరీ హీరోలు స్టీవ్ స్మిత్(104), ఖవాజా(147) క్రీజ్ లో ఉన్నారు. అంతకముందు ఓపెనర్ ట్రావిస్ హెడ్ 40 బంతుల్లోనే 57 పరుగులు చేసి మెరుపు ఆరంభాన్ని ఇచ్చాడు. శ్రీలంక బౌలర్లలో ప్రభాత్ జయసూర్య, జెఫ్రీ వాండర్సే తలో వికెట్ తీసుకున్నారు.



## మాళవిక రాజ్ బగ్గా: ఆధునిక ఫ్యాషన్‌లో క్లాసిక్ స్టార్

# లాయర్ పాపకి తెలుగు సినిమాలు లేవా..?

సినిమా హీరోయిన్ అయినంత మాత్రానా కెరియర్ సెట్ అయినట్టు కాదు అందుకే కొందరు హీరోయిన్స్ ఓ పక్క సినిమాలు చేస్తూనే మరోపక్క తమకు ఇష్టమైన వేరే కెరియర్ మీద దృష్టి పెడతారు. సినిమాల్లో హీరోయిన్ గా క్లిక్ అయితే ఓకే ఒకవేళ అవకపోతే మాత్రం వేరే దానికి షిఫ్ట్ అవుతారు. ఒకప్పటిలా కేవలం సినిమా హీరోయిన్ గా చేయాలనే ఆలోచన ఉన్న వారు ఎవరు లేరు. అందుకే ప్రొఫెషనల్ గా ఒక కెరీర్ ని సెట్ చేసుకుని సినిమాలను పార్ట్ టైం గా చేస్తున్నారు. అలాంటి వారిలో నేల టిక్కెట్టు భామ మాళవిక శర్మ ఒకరు. మోడల్ గా కెరియర్ మొదలు పెట్టి హీరోయిన్ గా టర్న్ తీసుకున్న మాళవిక శర్మ తనకు ఇష్టమైన లా కోర్స్ ని పూర్తి చేసింది. ఎల్.ఎల్.బి పూర్తి చేసిన మాళవిక శర్మ బార్ కౌన్సిల్ లో మెంబర్ షిప్ కూడా సంపాదించింది. మాస్ మహరాజ్ రవితేజతో నేల టిక్కెట్టు సినిమాతో హీరోయిన్ గా ఛాన్స్ అందుకున్న మాళవిక ఆ సినిమా ఫ్లాప్ అవడంతో పెద్దగా అవకాశాలు తెచ్చుకోలేదు. రామ్ రెడ్ సినిమాలో కూడా నటించినా ఆమె కెరియర్ కు పెద్దగా యూజ్ అవలేదు. టాలీవుడ్ లో అవకాశాలు లేని మాళవిక బాలీవుడ్ లో అడపాదడపా ఛాన్సులు అందుకుంటుంది. బ్యూటిఫుల్ లుక్స్.. సూపర్ టాలెంట్ ఉన్నా సరే మాళవికకు తెలుగులోం ఆఫర్లు కరువయ్యాయి. చేతిలో సినిమాలు ఏవి లేకపోయినా తన గ్లామ షోతో ఆడియన్స్ దృష్టిని ఆకర్షిస్తుంది మాళవిక. ముఖ్యంగా తన ఫోటో షూట్స్ తో రోజు రోజుకి ఫాలోవర్స్ ని పెంచుకుంటుంది.హీరోయిన్స్ కి కెరియర్ లో మొదటి సినిమా ఇంప్యాక్ట్ చాలా బలంగా ఉంటుంది. అయితే నేల టిక్కెట్టు ఒక్క సినిమాతో మాళవిక హీరోయిన్ గా అన్ ఫిట్ అని తేల్చి చెప్పడం కరెక్ట్ కాదు. అమ్మడికి ఒక ఛాన్స్ ఇచ్చి చూడాలని అంటున్నారు ఆమె ఫాలోవర్స్.సినిమా ఛాన్సులు ఎలాగు లేవని తన గ్లామర్ షోతో ఓ రేంజ్ లో రెచ్చిపోతుంది మాళవిక.



# బంధువులకు కౌంటర్ ఇచ్చిన హీరోయిన్!



సినిమా ఇండస్ట్రీ అంటే గ్యారెంటీ లేని లైఫ్. అందుకే సినిమాల్లోకి వెళ్తానంటే ఎవరూ ప్రోత్సహించరు. బాగా చదువుకుని మంచి ఉద్యోగం చూసుకుని పిల్లని చూసి పెళ్లి చేసుకుని స్థిరపడు అని ఓ సలహా ఇస్తారు. అలా వాళ్ల మాట కాదని సినిమాల్లోకి వచ్చి సక్సెస్ అయితే పర్వాలేదు. లేదంటే విమర్శలు...అవమానాలు...హేళనలు ఎన్నో ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఏ భాషలోనైనా ఫెయిలైన ప్రతీ ఒక్కరు ఈ ఫేజ్ చూడాల్సిందే. కన్నడ బ్యూటీ శ్రద్దా శ్రీనాధ్ కూడా ఇలాంటి విమర్శలు ఎదుర్కున్నట్లు తెలిపింది. ఇండస్ట్రీకి వెళ్లిన కొత్తలో ఏడాది కూడా ఉండలేదని తన బంధువులంతా హేళన చేసారట. సినిమాల్లో రాణించాలంటే చాలా ట్యాలెంట్ ఉండాలి. అది అందరితో సాధ్యం కాదు. ఇవన్నీ నీకెందుకు అన్నట్లు మాట్లాడారట. వాళ్లు అన్నట్లు గానే కెరీర్ ప్రారంభమైన కొత్తలో బంధువుల నుంచి చాలా మాటలు పడాల్సి వచ్చిందట. అయితే ఇప్పుడు తానెంత బిజీగా ఉన్నానో కూడా వాళ్లంతా ఇప్పుడు చూడాల్సిన సమయం వచ్చిందని అంటోంది. ఆ నాడు విమర్శించినోళ్లే నేడు ప్రశంసించాల్సిన బాధ్యత కూడా ఉంది. కానీ ఆ పని చేయడం లేదు. ఇప్పుడు కొత్తగా సక్సెస్ అయ్యాననే అక్కసుతో ఉన్నట్లు కనిపిస్తుంది. ఎదగనీయకుండా ఎక్కడో బయట వాళ్లు కాళ్లు లాగాల్సిన పనిలేదు. ఇంట్లో ఉన్న వారే అప్పుడప్పుడు ఇలాంటి చర్యలకు దిగుతారు.

అలాంటి వారితో జాగ్రత్తగా ఉండాలని సూచించింది. అమ్మడు తొలుత మాలీవుడ్ లో ఎంట్రీ ఇచ్చింది. అటుపై కన్నడ, తమిళ్ లో సినిమాలు చేసింది. జెర్సీ – సినిమాతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చింది. ఆ సినిమాతో నటిగా మంచి గుర్తింపు దక్కించుకుంది. అప్పటి నుంచి తెలుగు సినిమాల్లో కొనసాగుతోంది. ఇటీవలే – డాకు మహారాజ్ – తో మరో సక్సెస్ ఖాతాలో వేసుకుంది.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com